ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
ఆదివారం 27 ఏప్రిల్ 2025





కేఎస్ కీర్తిరెడ్డి తండ్రి కర్ణపు చలమారెడ్డి స్వస్థలం అన్నమయ్య జిల్లా రామాపురం మండలం కర్ణపువాండ్లపల్లె. తల్లి డి.శ్రీకృష్ణ సొంతూరు పులివెందుల మండలం బొగ్గిడివారిపల్లె. వీరిద్దరూ ఎల్ఐసీ ఉద్యోగులు. కడప సింగపూర్‌టౌన్‌షిప్‌లో స్థిరపడ్డారు. కీర్తిరెడ్డి భర్త శ్రీసాయి విజయవాడ ఆల్ ఇండియా రేడియో న్యూస్ హెడ్‌గా ఉన్నారు. సోదరి డిగ్రీ పూర్తయ్యి మాస్టర్స్ చేస్తున్నారు.



సివిల్స్.. ఒంటరి యుద్ధం

ఒకటి కాదు.. రెండు కాదు.. లక్ష్యం చేరుకోవడానికి ఏడేళ్ల సుదీర్ఘ ప్రయాణం. ఇంతకాలం ఒకే లక్ష్యంపై ఫోకస్‌గా ఉండాలంటే ఎంతో మనోధైర్యం ఉంటే తప్ప సాధ్యం కాదు. ఆరుసార్లు సివిల్స్ రాశారు. ఐదుసార్లు ప్రిలిమ్స్ పాసయ్యారు. రెండుసార్లు ఇంటర్వ్యూ వరకూ వెళ్లారు. చివరి ప్రయత్నంలో 316వ ర్యాంకు సాధించారు. కడప, అన్నమయ్య జిల్లాల్లో ఈ ఏడాది సివిల్స్‌లో ర్యాంకు సాధించిన ఏకైక మహిళ వీరే. ఈ ప్రయాణం అంత సులభంగా సాగలేదు. ఎన్నో ఎత్తుపల్లాలు. అన్నింటినీ అధిగమించారు. సివిల్స్ సాధనలో ఎదురయ్యే ఇబ్బందులను.. దానికి మానసికంగా శారీరకంగా దృఢంగా ఉండాల్సిన విషయాలను ఆంధ్రజ్యోతికి వివరించారు.

(కడప-ఆంధ్రజ్యోతి)

- గోల్ రీచ్‌కావాలంటే కఠోర సాధన తప్పనిసరి
- అమ్మాయిలు రెండింతలు కష్టపడాలి
- చదువుతో పాటు ఆరోగ్యమూ ముఖ్యమే
- సివిల్స్ 316వ ర్యాంకర్ కేఎస్ కీర్తిరెడ్డి

చివరిదాకా పోరాడాల్సిందే

నా గోల్ సివిల్స్. గోల్ పెట్టుకున్నాక దాన్ని సాధించేందుకు చివరిదాకా పోరాడాల్సిందే. దీనికి మైండ్‌సెట్ పూర్తిగా మార్చుకోవాలి. ఇదే లోకంగా ఉండాలి. రిజల్ట్ ఎలా అన్నా రానీ.. స్వీకరించాల్సిందే. దానికి సిద్ధంగా ఉంటేనే మనం లక్ష్యం వెంట ప్రయాణం చేయగలం. ఎక్కడా మనం డల్ కాకూడదు. సివిల్స్ అనేది మైండ్ గేమ్. ఎగ్జామ్ అంతా మైండ్‌గేమ్‌లానే ఉంటుంది. ఎవరి గేమ్ వారు ఆడాల్సిందే. దీనికి హార్డ్ వర్క్ చాలా అవసరం.

రూ.60లక్షల జీతంతో

నేనే ఐఐటీలో టాపర్‌ని. నాతో పాటు చదువుకున్న వారు ఇండియాలోనే రూ.60లక్షల జీతంతో పనిచేస్తున్నారు. మొదట్లో మూడుసార్లు రాశాను. తర్వాత పెళ్లయ్యాక కొంత బ్రేక్ వచ్చింది. అయితే మావారు కూడా సివిల్ సర్వెంటే. నిర్మలా సీతారామన్ లాంటి పెద్దపెద్దవాళ్లతో తను ఇంటరాక్ట్ అవుతుంటారు. మరి నేనేంటి ఇలా ఉండిపోయాను.. ఇది నా జీవితం కాదుకదా అనుకున్నాను. తిరిగి ప్రిపేర్ అవ్వడం మొదలు పెట్టాను. నాకు మొదట్లో భయం ఉండేది. దానిని పోగొట్టుకున్నాను. ఈ సుదీర్ఘ ప్రయాణంలో అమ్మానాన్న చెల్లి, మా వారి సపోర్ట్ ఎంతో ఉంది.

న్యూస్ పేపర్ రీడింగ్ కీలకం

నేను మొదట్లో న్యూస్ పేపర్‌ను ఎక్కువ చదివేదానిని కాదు. అది నా రైటింగ్‌లో ప్రభావం చూపించింది. న్యూస్‌పేపర్స్ చాలా కీలకం. ఇంటర్వ్యూకు కూడా ఉపయోగపడుతుంది. ఆప్షనల్స్‌లోనూ రిఫ్లెక్ట్ అవుతుంది. ఇంటర్వ్యూకు వెళ్లే రోజువరకూ న్యూస్ పేపర్ చూడాల్సిందే. బల్క్ ఇన్ఫర్మేషన్ వద్దు. స్టాటిస్టిక్స్ కీలకం. ఇవన్నీ కావాలంటే న్యూస్‌పేపర్‌ను రెగ్యులర్‌గా ఫాలో కావాలి.

ఆరోగ్యం చాలా కీలకం

సివిల్స్‌ను నెగ్గడంలో హెల్త్ చాలా చాలా కీలకం. మానసికంగా శారీరకంగా దృఢంగా ఉండాలి. రోజూ వాకింగ్, యోగా, ధ్యానం చేసేదాన్ని. ఇవి మన మనసును, శరీరాన్ని దృఢంగా ఉంచుతాయి. మన మెంటల్ స్టేటస్ ఎంత స్ట్రాంగ్‌గా ఉంటే.. మనం సివిల్స్‌ను అంత తొందరగా రీచ్ కాగలం. ఫిట్‌నెస్ చాలా అవసరం. మనలను మనం కాపాడుకోవడానికైనా మనం స్ట్రాంగ్‌గా ఉండాలి కదా.

సొంతంగా నోట్సు

చదువుకునే సమయంలో ముఖ్యమైన పాయింట్‌ను హైలెటర్‌తో మార్క్ చేసుకుంటాను. ప్రతి రివిజన్‌కూ కలర్ మారుస్తూ వెళతాను. ఇలా చేయడం వలన ఎన్నిసార్లు రివిజన్ చేశామనేది తెలుస్తుంది. సొంతంగా నోట్స్ ప్రిపేర్ చేసుకోవాలి. మనం కోచింగ్ తీసుకున్నా.. వారు మెటీరియల్ ఇచ్చినా సరే.. సొంతంగా నోట్స్ ఉండాలి.

సోషల్ మీడియాకు దూరం

డీవియేషన్స్ ఉండకూడదు. ముఖ్యంగా సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి. చదువుకోవడానికి షెడ్యూల్ వేసుకోవాలి. మనం వేసుకున్న షెడ్యూల్ రోజూ 100 శాతం రీచ్ కావాలి. కనీసం 80 శాతం తప్పనిసరిగా కంప్లీట్ చేయాలి. ఫోకస్‌గా ఉండాలి. బ్రాడ్ ఆలోచనలు వద్దు. ఇది ఎగ్జామ్ మాత్రమే. జీవితం కాదు. ఒంటరిగా చేసే యుద్ధం. మన ప్రయత్నం చేయాలి. ఒకవేళ రీచ్ కాకపోతే ఏమీ కాదు. భయం వద్దు.

ఢిల్లీకి వెళ్లే అవసరం లేదు

నేను 7వతరగతి వరకు మాత్రమే డే స్కాలర్‌ని. తర్వాతంతా హాస్టలే. నేను సివిల్స్ ప్రిపరేషన్ కోసం ఢిల్లీలో రెండేళ్లున్నా. తర్వాత ఇంటినుంచే ప్రిపేర్ అయ్యా. కోచింగ్ తీసుకోవాలి, ఢిల్లీలోనే ఉండాలనేం లేదు. ఇంట్లోనే ఉండాలా, నగరానికి వెళ్లాలా అనేది ఎవరికి వాళ్లు నిర్ణయించుకోవాలి.

మనలను మనం ప్రశ్నించుకోవాలి

మనలను మనం ప్రశ్నించుకోవడం చాలా ముఖ్యం. ఫలానా సమస్య వచ్చింది. దీనికి నేనేం చేశాను..? ఈ రోజు చదవలేకపోయాను.. ఎందుకు చదవలేకపోయాను..? ఈ రోజు మూడ్ బాగోలేదు.. ఎందుకు బాగోలేదు దీనికి నేనేం చేయాలి..? ఇలా మనకు ఎదురయ్యే ప్రతి సమస్యకూ పరిష్కరించేందుకు మనమేం చేస్తున్నాం అనేది చాలా ముఖ్యం. ఇంట్లో పేరెంట్స్‌కు కూడా మనకేం కావాలో మనం స్పష్టంగా చెప్పగలగాలి. రిజిడ్‌గా ఉండకూడదు. ఓపెన్ మైండ్‌సెంట్ ఉండాలి.

క్రమశిక్షణ ముఖ్యం

ఏదైనా రీచ్ కావాలంటే సూపర్ ఇంటలిజెన్సే ఉండాల్సిన అవసరం లేదు. నిలకడైన క్రమశిక్షణ ఎంతో ముఖ్యం. ఇది ఒంటరి పోరాటం. మనం ఒంటరిగా రాయాల్సిన పరీక్ష. ఒక్కోసారి పదిరోజులు చదివినా సబ్జెక్ట్ బుర్రలోకి సరిగా పోదు. ఒక్కోసారి రెండురోజుల్లోనే బుర్రలోకి పోతుంది. మూడ్ స్వింగ్స్ ఉంటాయి. ఇది సుదీర్ఘ ప్రక్రియ కావడంతో తప్పదు. మనం కంగారు పడాల్సిన పనిలేదు. ఇదేమీ కేక్ వాక్ కాదు. కష్టపడాల్సిందే.

ఇదే జీవితం కాదు

ఈ చదివే ప్రక్రియ ఎలా ఉంటుందంటే.. గూటిలో దూరుకుని ఉండే పక్షిలా ఉంటుంది. ఇంత ప్రయత్నం చేసినా అనుకున్నది సాధించలేకపోవచ్చు. అంతమాత్రాన పోయేదేం లేదు. ఇదే జీవితానికి అంతం కాదు. మనం 100 శాతం ఫోకస్‌గా ప్రయత్నం చేస్తున్నామా లేదా అనేదే ముఖ్యం. మన ఫోకస్ అంతా గోల్‌పైనే ఉంటే చేరుతాం. లేదంటే లేదు. మనకు ఇది సాధ్యం కాదు అని తెలుసుకున్నాక.. దానిపైన కూర్చోవడం వేస్ట్. మనం ఏది చేయగలమో అదే చేసుకోవాలి.

అమ్మాయిలు రెండింతలు కష్టపడాలి

మాకు అన్నీ తెలుసు, ఏదైనా సాధించగలం అనే మైండ్‌సెట్ అబ్బాయిలకు ఉంటుంది. వాళ్లు సాధించలేకపోయినా సరే అదే మైండ్‌సెట్‌తో ఉంటారు. అమ్మాయిలను సొసైటీ తక్కువగా చూస్తుంది. మన మైండ్‌ను అది తెలీకుండానే వెంటాడుతుంటుంది. అమ్మాయిలు ఏదైనా రీచ్ కావాలంటే అబ్బాయిలకన్నా రెండింతలు కష్టడాలి. కష్టపడితే సాధ్యంకానిది లేదు. ముఖ్యంగా అమ్మాయిలు అనుకుంటే ఏదైనా సాధించగలరు.

ఏదైనా నేర్చుకుంటేనే ఆనందం

ఎప్పుడూ పుస్తకాలు చదువుతూనే ఉండలేం. అప్పుడప్పుడు చిన్నచిన్న బ్రేక్‌లు తీసుకోవాలి. మైండ్‌కు రిలీఫ్ వస్తుంది. నేను ఒక్కోసారి రెండుమూడు రోజులు వరుసగా వెబ్‌సిరీస్‌లు చూసేదాన్ని. అవి చూశాక సంతోషం అనిపిస్తుంది. అయితే నాకు దీనికన్నా 20 రోజులు కష్టపడి చదివి ఏదైనా నేర్చుకుంటే వచ్చే ఆనందమే ఎక్కువ.

చాలా త్యాగం చేశాం..

మా అమ్మాయి ఏడేళ్లు పోరాటం చేసింది. ఈ ప్రక్రియలో మేము చాలా త్యాగం చేయాల్సి వచ్చింది. పిల్లల కలలు నెరవేరాలంటే పెద్దలు చాలా త్యాగాలు చేయాల్సిందే. ఎవ్వరూ దీనికి అతీతులు కాదు. పిల్లలు గోల్ రీచ్ అయ్యాక.. మనం అప్పటి దాకా ఏం త్యాగం చేశామో అంతకు రెట్టింపు పొందుతాం. మా అమ్మాయి చదువుతో పాటు ఆరోగ్యం కోసం ఒకరకంగా కఠోర తపస్సు చేసింది. డైట్, నిద్ర, వ్యాయామం.. అన్నింటిలో క్రమశిక్షణ పాటించింది. ఆరోగ్యం చాలా ముఖ్యం. కొత్తగా ప్రిపేర్ అయ్యేవాళ్లకు కూడా నేను ఇదే చెబుతా. ముఖ్యంగా అమ్మాయిలు.. ఆరోగ్యం, చదువు పేరలల్‌గా బేలన్స్ చేసుకోవాలి.

- కర్ణపు చలమారెడ్డి, డి.శ్రీకృష్ణ (కీర్తిరెడ్డి తల్లిదండ్రులు)



Sunday Special

పర్యాటకరంగంతో ఆర్థికాభివృద్ధి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి(కలెక్టరేట్), ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఆర్థికాభివృద్ధికి, సాంస్కృతిక పరిరక్షణకు పర్యాటక రంగం కీలకమని, ముఖ్యమైన పర్యాటక కేంద్రాల్లో హోం స్టేల నిర్మాణం జరగాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. శనివారం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా పర్యాటక కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాయచోటి, పీలేరు, రాజంపేటల్లో నిర్మించబోయే మూడు నక్షత్రాల హోటళ్లకు గుర్తించిన భూములను పర్యాటక శాఖకు అప్పగించాలని సబ్ కలెక్టర్లను ఆదేశించారు. హార్సీలీహిల్స్‌లో అరకు కాఫీ కోసం గుర్తించిన స్థలాన్ని గిరిజన కార్పొరేషన్‌కు అందించేందుకు చర్యలు తీసుకోవాలని మదనపల్లె సబ్ కలెక్టర్‌ను ఆదేశించారు. హార్సీలీహిల్స్‌లో లేపాక్షి స్టాల్ ఏర్పాటుకు స్థలాన్ని గుర్తించి పర్యాటకశాఖకు అందజేయాలన్నారు స్వయం సహాయక బృందాలతో హోమ్ స్టేలను నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని పీడీ డీఆర్డీఏను ఆదేశించారు. గుర్రంకొండ ఫోర్ట్, హార్సీహిల్స్, వెలిగల్లు, కోడూరులోని రెడ్‌వుడ్ పార్క్ తదతర పర్యాటక ప్రదేశాల్లో శానిటరీ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేసేందుకు ఒక్కొక్క చోట ఒక్కో సెంటును పర్యాటకశాఖకు అందజేయాలని ఆదేశించారు. రాయచోటి దగ్గర శిల్పారామం నిర్మాణంలో పురోగతి సాధించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్, మదనపల్లె, రాజంపేట సబ్ కలెక్టర్లు మేఘస్వరూప్, నైదియాదేవి, పర్యాటకశాఖ రీజనల్ డైరెక్టర్ రమణప్రసాద్, ఏపీ టీడీసీ ఈఈ సుబ్రమణ్యం, జిల్లా పర్యాటకశాఖ అధికారి నాగభూషణం, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, ఏపీఎస్‌ఆర్టీసీ జిల్లా అధికారి రాము, జిల్లా దేవదాయ ధర్మాదాయశాఖ అధికారి విశ్వనాథ్, మదనపల్లె మున్సిపల్ కమిషనర్ ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

హార్సిలీహిల్స్‌లో చిరుతపులి

- మూడో మలుపులో రోడ్డుదాటిన వైనం

బి.కొత్తకోట, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్‌లో చిరుత సంచారం కలకలం రేపింది. బి.కొత్తకోట పట్టణంలోని బైపాస్‌రోడ్డులో నివాసం వుంటున్న నరేశ్, మోహన్‌రెడ్డి బృందం శుక్రవారం హార్సిలీహిల్స్ పర్యటనకు వెళ్లారు. రాత్రి పొద్దు పోయాక తమ కారులో తిరుగు ప్రయాణమయ్యారు. వాహనం ఘాట్‌రోడ్డులో మూడవ మలుపు తిరగ్గానే ఎడమ వైపునున్న ఎత్తైన ప్రాంతం నుంచి రోడ్డును క్రాస్ చేస్తూ ఓ చిరుతపులి దిగువకు వెళ్లింది. రెప్పపాటులో జరిగిన ఈ సంఘటనతో కారులో ఉన్నవారు తీవ్రభయాందోళన చెందారు. తమ వాహనం ముందుభాగంలోని కెమెరాలతో కూడిన డ్యాష్‌క్యాంలో ఈ చిరుత వెళ్లిన దృశ్యం క్లియర్ గా రికార్డు అయింది. చిరుత వెళ్లిపోయాక తేరుకొని వీరు కొండదిగిపోయారు. శనివారం ఘటన విషయం బయటకు రావడంతో పర్యాటకులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ద్విచక్ర వాహనదారులు, సరదాగా కాలినడకన హిల్స్ పైకి వచ్చే పర్యాటకులు అప్రమత్తంగా ఉండాలని, ఒంటరిగా ఎవ్వరూ రాకూడదని ఫారెస్ట్ సెక్షన్‌ఆఫీసర్ శివకుమార్ సూచించారు.

నేరస్థులకు శిక్షపడేలా చార్జ్‌షీట్లు వేయండి

- అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి



నెలవారి నేర సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ ఎం. వెంకటాద్రి

రాయచోటి టౌన్, ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి): నేరస్థులకు శిక్ష పడేలా పటిష్టమైన సాక్ష్యాధారాలతో చార్జ్‌షీట్లను నిర్దిష్ట గడువులోగా కోర్టులో దాఖలు చేయాలని అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి పోలీసు అధికారులను ఆదేశించారు. శనివారం రాయచోటి పట్టణంలోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో రాజంపేట సబ్ డివిజన్ పోలీస్ అధికారులకు నెలవారీ నేర సమీక్షా సమవేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని, ముఖ్యంగా తీవ్రమైన కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని ఆదేశించారు. దర్యాప్తులో నాణ్యత పెంచాలని, శాస్త్రీయ ఆధారాలు సేకరించడంపై దృష్టి పెట్టాలని సూచించారు. దొంగతనాలు, రాత్రి సమయాల్లో జరిగే నేరాలను అరికట్టడానికి బీట్ పోలీసులు, రక్షక్ బృందాలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రహదారి భద్రతపై ప్రత్యేక దృష్టి సారించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. సైబర్ నేరాల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని, ఆన్‌లైన్ మోసాల బారిన పడకుండా అవగాహన కల్పించాలని అన్నారు. ఎర్రచందనం అక్రమ రవాణాను పూర్తిగా నిరోధించడానికి నిఘా పెంచాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే విచారణ జరిపి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. మహిళలు, బాలికలు, బలహీన వర్గాలపై జరిగే నేరాల పట్ల మరింత సున్నితంగా వ్యవహరించి వారికి భరోసా కల్పించాలని తెలిపారు. పోలీసు అధికారులు, సిబ్బంది క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని, ప్రజలతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో రాజంపేట ఏఎస్పీ మనోజ్‌రామనాథ్‌హెగ్డే, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

మండలాలకు తరలిన పాఠ్యపుస్తకాలు

- తొలి విడత నాలుగు మండలాలకు


కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠ్యపుస్తకాలను మండలాలకు తరలిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి షంషుద్దీన్ తెలిపారు. తొలి విడతగా నాలుగు మండలాలకు పంపించామన్నారు. శనివారం కడప నగరంలోని ప్రభుత్వ పాఠ్యపుస్తకాల గోదాము నుంచి మండలాలకు పుస్తకాలను తరలించే వాహనాలను డీఈవో జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప, అన్నమయ్య జిల్లాలకు సంబంధించి ఒకటి నుంచి 10వ తరగతి ఫస్ట్ సెమిస్టర్ వరకు 9,76,346 పాఠ్యపుస్తకాలు రావాల్సి ఉండగా 7,20,161 పుస్తకాలు జిల్లాకు చేరాయని చెప్పారు. ఇంకా 2,56,185 పాఠ్యపుస్తకాలు రావాల్సి ఉందన్నారు. తొలి విడతగా రాజంపేటకు 23,158, సిద్దవటానికి 9,944, అట్లూరుకు 5,840, బద్వేల్‌కు 12,777.. మొత్తం 51,719 పాఠ్యపుస్తకాలను తరలించామని చెప్పారు. పాఠశాలలు ప్రారంభ సమయ్యే సమయానికి విద్యార్థులందరికి పుస్తకాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ టెక్స్ బుక్స్ జిల్లా మేనేజర్, సిబ్బంది పాల్గొన్నారు.



మృతదేహాల వద్ద రోదిస్తున్న కుటుంబీకులు

అయ్యో..!

- ఈత సరదాకు నలుగురు బలి
- ఒకే కుటుంబంలో ముగ్గురు మృతి
- చెరువులోకి దిగి తిరిగిరాని లోకాలకు



చెరువులో మృతదేహాల కోసం వెతుకుతున్న పోలీసులు, గజ ఈతగాళ్లు



నందిత (ఫైల్‌ఫొటో)



కొడుకు నందకిశోర్, కూతురు లావణ్యతో మల్లేశ్ (ఫైల్‌ఫొటో)

ములకలచెరువు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): పాత ములకలచెరువు పెద్దచెరువు నలుగురిని బలిగొంది. సరదాగా నీటిలో దిగిన ముగ్గురు పిల్లలు, తరువాత వారిని కాపాడేందుకు వెళ్ళిన కుటుంబ పెద్ద వరుసగా గల్లంతై తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారు. మృతుల్లో తండ్రి కొడుకు కూతురు ఉండటం పెద్ద విషాదం. రాత్రి కావడంతో మృతదేహాలను వెలికితీసేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి.

ములకలచెరువు సమీపంలోని ప్రభుత్వ లేఅవుట్‌లో బాడుగ ఇంట్లో నివాసమున్న కనికరం మల్లేశ్ వారం రోజులుగా క్లీనర్ పనికి వెళ్లి శనివారం ఉదయమే ఇంటికి వచ్చాడు. దీంతో భార్య ఈశ్వరమ్మ బట్టలు ఉతుక్కొని వస్తామని చెప్పడంతో భర్త మల్లేశ్(35), కుమార్తె లావణ్య(12), కుమారుడు నందకిశోర్(11)లు పాత ములకలచెరువు పెద్దచెరువు వద్దకు బయలుదేరారు. ఇదే సమయంలో ఎదురింట్లో ఉన్న వెంకటరమణ కుమార్తె నందిత(13) కూడా వీరితో పాటు వెళ్లింది. నందిత కర్ణాటక రాష్ట్రం చింతామణిలోని బంధువుల దగ్గర ఉంటూ అక్కడే చదువుకుంటోంది. వేసవి సెలవులు రావడంతో ఇటీవలే ఇంటికి వచ్చింది. ఈ క్రమంలో పిల్లలు ముగ్గురూ సరదాగా చెరువులోకి దిగి ఆడుకుంటూ లోతుగా ఉన్న ప్రదేశానికి వెళ్లి పూడులో ఇరుక్కుని ఒకరి తరువాత ఒకరు మునిగిపోయారు. ఇది గమనించిన మల్లేశ్ వీరిని కాపాడేందుకు చెరువులో దిగి ఆయన పూడులో ఇరుక్కుని గల్లంతయ్యాడు. లోతు ఎక్కువగా ఉండడంతో పాటు జనసంచారం లేని ప్రాంతం కావడంతో విషయం చాలా సేపు వరకు ఎవరికీ తెలియకుండా పోయింది. గట్టున ఉన్న భార్య అక్కడి నుంచి చాలా పరిగెత్తుకుంటూ వచ్చి దారిన పోతున్న వారికి విషయం చెప్పారు. వారి ద్వారా సమాచారం అందుకున్న ఎస్ఐ నరసింహుడు తమ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. రాత్రి కావడం, చెరువు పరిధి ఎక్కువగా ఉండడంతో నలుగురూ ఎక్కడ గల్లంతు అయ్యారో తెలియరాలేదు. దీంతో ఎస్ఐ నరసింహుడు, పాత్రికేయుడు విజయ్‌కుమార్ ముగ్గురు గజఈతగాళ్లతో కలసి చెరువులోకి దిగా గల్లంతైన వారి కోసం అరగంటకుపైగా గాలించారు. తొలుత మల్లేశ్, తరువాత ముగ్గురు పిల్లల మృతదేహాలు నీటిలో దొరికాయి. రాత్రివేళ కావడంతో టార్చిలైట్లతో మృతదేహాల కోసం గాలించాల్సి వచ్చింది. నలుగురి మృతదేహాలను చూసి కుటుంబీకులు భోరున విలపించారు. భారీగా తరలివచ్చిన స్థానికులు కూడా కంటనీరు పెట్టుకున్నారు. మల్లేశ్ కుమార్తె లావణ్య, కుమారుడు నందకిశక్షర్ స్థానిక జడ్పీ హైస్కూల్‌లో చదువుతున్నారు. వేసవి సెలవులు కావడంతో ఇంటి వద్దే ఉన్నారు.

అయ్యో పాపం... ఈశ్వరమ్మ

భర్త మల్లేశ్, కుమార్తె లావణ్య, కుమారుడు నందకిశోర్‌లు కళ్లముందే చెరువులో మునిగి మృతిచెందడంతో ఈశ్వరమ్మ భోరున విలపించారు. విధి ఆడిన నాటకంలో కుటుంబం మొత్తం తిరిగిరాని లోకాలకు వెళ్లిపోవడంతో ఈశ్వరమ్మ అనాథగా మారారు. కుటుంబం మొత్తం తీసుకెళ్లి నన్నెందుకు వదిలేశావు దేవుడా అంటూ గుండెలు పగిలేలా రోదించిన ఈశ్వరమ్మను చూసిన స్థానికులు సైతం కంటతడి పెట్టారు.

ఫాసిజమే మానవాళికి శత్రువు

- యుద్ధం అంటే వినాశనమే
- స్నేహ సంబంధాలను పెంచుదాం.
- ఇస్కఫ్ 20 రాష్ట్ర మహాసభలో వక్తల పిలుపు


మహాసభల్లో మాట్లాడుతున్న జాతీయ ప్రధాన కార్యదర్శి బిజయ్ కుమార్ పదిహారి.. హాజరైన జనం

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ మానవాళికి ఫాసిజం ప్రధాన శత్రువు అని భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బిజయ్ కుమార్ పదిహారి అన్నారు. శనివారం స్థానిక గొల్లపల్లెలోని శేషసాయి కల్యాణ మండపంలో ఇస్కఫ్ 20వ రాష్ట్ర మహాసభ (ఇస్కఫ్)ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు టీఎస్ సుకుమారన్ అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా పహల్గావ్‌లో ఉగ్రవాద దాడిలో అసువులు బాసిన వారి ఆత్మశాంతికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం ఇస్కఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి బిజయ్ కుమార్ పదిహారి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా మానవాళి తీవ్ర సంక్షోభాల మధ్య జీవిస్తోందన్నారు. అధిపత్యం కోసం అగ్రరాజ్యాలు యుద్ధోన్మాదాన్ని పెంచుతున్నాయని తెలిపారు. పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడి విషయం గుర్తు చేశారు. భారతదేశంపై కూడా ఉగ్రదాడి జరిగిందని. ఉగ్రవాదులకు కూడా అగ్రరాజ్యాలే ఆయుధాలు అమ్ముతున్నాయన్నారు. యుద్ధం మానవాళి వినాశనానికి దారి తీస్తోందన్నారు. ఫాసిజం జడలు విప్పుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. అది మానవాళికి ప్రధాన శత్రువని అన్నారు. హిట్లర్ ఫాసిజానికి వ్యతిరేకంగా నిలబడిన నేతలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. రానున్న ఆగస్టు 30న ఫిడేల్ క్యాస్ట్రో జయంతిని దేశ వ్యాప్తంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం విదేశాల మధ్య సంబంధాలు బలహీన పడుతున్నాయని, ఈ క్రమంలో ప్రజల మధ్య స్నేహ సంబంధాలను పెంచడం ద్వారా మానవ సంబంధాలు బలపడుతాయని అన్నారు. ఇందు కోసం ఇస్కఫ్ దశాబ్దాలుగా పని చేస్తోందన్నారు. మరెంత చైతన్యవంతంగా పని చేద్దామని పిలుపునిచ్చారు. భారతదేశానికి అన్ని ప్రపంచ దేశాల ప్రజాలతో స్నేహ, శాంతి పూర్వక సంబంధాలు మెరుగు పర్చడం ఇస్కఫ్ ఆశయమని స్పష్టం చేశారు. చైన్నై నుంచి ప్రత్యేక అతిథిగా విచ్చేసిన డిప్యూటీ కౌన్సిల్ జనరల్ ఆఫ్ రష్యా సెర్జెయ్ అజారోస్ సందేశమిచ్చారు. ఆయన మాట్లాడుతూ రష్యా భారతదేశం మధ్య సహకార సంబంధాలకే చాలా విస్తారమైన అవకాశాలు ఉన్నాయని తెలిపారు. అన్ని రంగాల్లో అభివృద్ధి కోసం భారతదేశం కలిసి పని చేయాలన్నారు. రష్యా, భారతీయ సంబంధాల విషయంలో రష్యా అధ్యక్షుడు పుతిన్ అంచనాలు చాలా ఉన్నంతంగా ఉన్నాయన్నారు. భారత సమాజం అభివృద్ధికి సోవియట్ కాలం నుంచి ఇప్పటికీ రష్యా పూర్తి అండగా ఉందని తెలిపారు. ఇరుదేశాల ప్రజల మధ్య, ప్రభుత్వాల మధ్య సాంస్కృతిక, క్రీడలు, కళా సంబంధాలు బలంగా ఉన్నాయన్నారు. దీని ద్వారా భారతీయ నిపుణులు రష్యాలో శిక్షణ పొందారని గుర్తు చేశారు. విద్యకు సంబంధించి చాలా ఉన్నతమైన మేళవింపు ఉందన్నారు. భారత్ ఒక శక్తివంతమైన దేశంగా వెలుగొందాలని తాము అభిలషిస్తున్నామన్నారు. రెండు దేశాల భవిష్యత్ కోసం కలిసి పని చేయాలని పిలుపునిచ్చారు. ఇస్కఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాగితాల రాజశేఖర్ నివేదికను ప్రవేశ పెట్టారు. గత మూడేళ్ల ఇస్కఫ్ కృషిని వివరించారు. మతాన్ని, సంస్కృతిని కలుషితం చేసి ప్రజలను మభ్యపెట్టడానికి చూస్తున్న శక్తుల నిజ స్వరూపాన్ని చర్చకు పెట్టి సమాజానికి దిశానిర్దేశం చేయడం మనందరి కర్తవ్యం అన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, ఎస్కే యూనివర్సిటీ విశ్రాంత ఆచార్యులు వెంకటరెడ్డి, ఇస్కఫ్ ప్రధాన కార్యదర్శి ఎస్ నరసింహులు, తమిళనాడు ఇస్కఫ్ నేత సుధాకర్, తెలంగాణ ప్రతినిధి అరుణ, తుంగా శ్రీధర్, రామచంద్రయ్య, మాచిరెడ్డి, డాక్టర్ సంజీవయ్య, బి.కృష్ణ, ఇస్కఫ్ కోశాధికారి సత్యాంజనేయ, అనకాపల్లె నేత మాధవరావు, సీహెచ్ శ్రీదేవి, అరుణ్‌కుమార్, యువజన సమాఖ్య జాతీయ నేత లెనిన్‌బాబు, క్షేత్రపాల్‌రెడ్డి, వెంకటరావు, సీపీఐ నియోజకవర్గ నాయకుడు మురళి, వివిధ జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు.

పాకిస్థానీయులూ.. పదండి

- మదనపల్లెలో ఐదుగురు గుర్తింపు...
- పోలీసులు నోటీసులు జారీ

మదనపల్లె, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్ పౌరసత్వం కలిగి కొన్నేళ్లుగా ఇక్కడే నివాసం ఉంటున్న ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురిని పోలీసులు గుర్తించారు. పహల్గామ్ తీవ్రవాద దాడి నేపథ్యంలో అప్రమత్తమైన కేంద్రం వీసాలు ఆపేసి, ఇప్పటికే మనదేశంలో నివసిస్తున్న వారిని పాకిస్థాన్ పంపేయాలని నిర్ణయించింది. ఇందులో బాగంగా పోలీసులు ఎక్కడికక్కడ జల్లెడ పడుతున్నారు.. ఈ క్రమంలో మదనపల్లెలో కొన్నేళ్లుగా నివాసం ఉన్న ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురిని శనివారం గుర్తించారు. ఎస్పీ ఆదేశాల మేరకు నోటీసులు జారీ చేసి దేశం విడిచి వెళ్లాని సూచించారు.

మదనపల్లె పట్టణంలోని కురవంకలో పాకిస్థాన్ పౌరసత్వం కలిగిన ఐదుగురు స్థిర నివాసం ఏర్పరుచుకున్నారు. శనివారం వారికి పోలీసులు నోటీసులు అందించి తక్షణం దేశం విడిచి వెళ్లాల్సిందిగా ఆదేశించారు. అయితే దీనికి సంబంధించి తదుపరి ఉత్తర్వులు ఏవీ రాకపోవడంతో ప్రస్తుతానికి వారు ఇక్కడే ఉన్నారు. స్థానిక ఆంజనేయస్వామి గుడి వీధికి చెందిన గులాబ్‌జాన్ కొన్నేళ్ల క్రితం సౌదీకి వెళ్లి అక్కడ పాకిస్తానీయుడైన బషీర్ అహ్మద్ భట్‌ను పెళ్లి చేసుకుంది. వీరికి ఐదుగురు సంతానం. వారికి పాకిస్థాన్ పౌరసత్వం ఉంది. తర్వాత పిల్లలను ఐదుగురిని తీసుకుని గులాబ్‌జాన్ మదనపల్లెకు చేరుకుంది. ఇక్కడ మరో కుమారుడు జన్మించాడు. అతడికి భారతదేశ పౌరసత్వం ఉంది. మదనపల్లెలో ఉంటున్న పాకిస్థాన్ పౌరసత్వం కలిగిన గులాబ్‌జాన్ ఐదుగురు సంతానం ఇక్కడే విద్యాభ్యాసం పూర్తి చేశారు. ఇండియాలో రెసిడెన్స్ వీసా పొంది రెన్యువల్ చేసుకుంటూ ఇక్కడే ఉంటున్నారు. వారిలో పెద్ద కూతురు షాజియా ఖాన్వాల్(35) బెంగళూరులో కేరళకు చెందిన వ్యక్తిని పెళ్లి చేసుకుంది. రెండవ సంతానం మహమ్మద్ యాసీన్ (32) మదనపల్లెలో పనిచేస్తూ ఇక్కడికి చెందిన అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడు. మూడవ సంతానమైన షమ్మా బషీర్ అహమ్మద్ వాల్మీకిపురంలో వివాహం చేసుకుంది. నాల్గో సంతానమైన యాస్ బషీర్, ఐదవ సంతానం ఫాతీమ బషీర్ ఇద్దరు అవివాహితులు. అయితే ఇప్పటికిప్పుడు దేశం విడిచి వెళ్లడానికి వాళ్లు నిరాకరించడంతో ఉన్నతాధికారులకు తెలియజేసి వారి ఆదేశాల కోసం పోలీసులు ఎదురుచూస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

- అడ్డుకున్న పోలీసులు

సిద్దవటం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): భార్య అనారోగ్యం కారణంగా మృతిచెందుతుందన్న బాధలో శనివారం ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన సిద్దవటం పోలీసులు అతన్ని కాపాడి మానవత్వాన్ని చాటుకున్నారు. ఆ వివరాల్లోకి వెళితే.. అట్లూరు క్రాస్ రోడ్డులో నివాసం అబ్బిరెడ్డి అనే వయోవృద్ధుడు తన భార్య ఆరోగ్యం గత కొన్నిరోజులుగా సరిగ్గా లేకపోవడంతో ఆమె మృతి చెందుతుందనే మనస్థాపంతో రైలు కింద పడి మృతి చెందాలని నిర్ణయించుకున్నాడు. ఈ మేరకు మండలంలోని కనుమలోపల్లి రైల్వేస్టేషన్ పరిధిలో ఆత్మహత్యాయత్నం చేసుకోబోతుండగా గమనించిన రైల్వే అధికారులు స్థానిక పోలీసుస్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు అక్కడకు చేరుకుని అబ్బిరెడ్డిని కాపాడి స్టేషన్‌కు తరలించారు. అనంతరం అతని బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ మహమ్మద్‌రఫీ తెలిపారు.

సీసీ కెమెరాలు చోరీ

కలకడ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కలకడ మండలంలోని ఆదర్శ పాఠశాల గేట్ వద్ద ఏర్పాటు చేసిన రెండు సీసీ కెమెరాలను గుర్తుతెలియని వ్యక్తులు గురువారం రాత్రి చోరీ చేశారు. ఇక్కడ పని చేస్తున్న వాచ్‌మన్ రామాంజులు రాత్రి భోజనానికి వెళ్లి తిరిగి వచ్చేలోపు ఈ చోరీ జరిగింది. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు అందింది.

రైలుకింద పడి మహిళ మృతి

పుల్లంపేట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దేవసముద్రం వడ్డిపల్లెకు చెందిన పసుపులేటి సీతమ్మ శనివారం ఉడుమువారిపల్లె సమీపాన రైలుకింద పడి మృతి చెందింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. సీతమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సంఘటనపై రేణిగుంట రైల్వేపోలీసు గౌరీశంకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బడి తాళాలు పగలగొట్టిన ఆకతాయిలు

- రిజిస్టర్ల చింపివేత
- కుర్చీలు, బెంచీలు విరగ్గొట్టి హల్‌చల్

సుండుపల్లె, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి సమీపంలోని దిగువగుల్లావాండ్లపల్లె ఎంపీపీ పాఠశాల తాళాలు పగలగొట్టి ఆకతాయిలు హల్‌చల్ చేశారు. ప్రహరీ దూకి వచ్చి బోర్డుపై పెయింట్‌తో లవ్ సింబల్స్ వేసి హంగామా చేసినట్లు ఆ పాఠశాల హెడ్మాస్టర్ కృష్ణవేణి శనివారం తెలిపారు. పాఠశాలలోని రికార్డు గదిలోకి వెళ్లి రిజిస్టర్లు చింపి కుర్చీలు, బెంచీలు విరగ్గొట్టారన్నారు. సీసీ కెమెరాల ఆధారంగా వారిని గుర్తించి కేసు నమోదు చేయాలని ఆమె కోరారు. ప్రభుత్వ బడి తాళాలు పగులగొట్టడం నేరంగా పరిగణించి అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.


బీరువా తాళాలు పగలగొట్టిన దృశ్యం

ప్రభుత్వ పథకాల్లో లక్ష్యాలను సాధించాలి

- గ్రామాల్లో ఎక్కడా తాగునీటికి ఇబ్బంది రాకూడదు
- కలెక్టర్ చామకూరి శ్రీధర్


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి(కలెక్టరేట్), ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి): ప్రజల సంక్షేమ, ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పథకాల్లో వందశాతం లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేట్ మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి రెవెన్యూ, సామాజిక పింఛన్లు, తాగునీరు, జీఎస్‌డబ్ల్యూఎస్, గృహ నిర్మాణం, డ్వామా, పంచాయతీరాజ్, పారిశుధ్య తదితర అంశాలపై మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పౌరులకు మెరుగైన రెవెన్యూ సేవలను అందించాలన్నారు. ఇంటి నిర్మాణం కోసం పొజిషన్ సర్టిఫికెట్ల జారీలో వెనుకబడిన మండలాల తహసీల్దార్లతో ఆర్డీవో, సబ్ కలెక్టర్ స్వయంగా సమీక్షించి ఒక వారంలోగా పెండింగ్ పూర్తి చేయాలన్నారు. ప్రతి మండలంలో ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు పాజిబులిటీ నివేదికను వెంటనే పంపాలని సూచించారు. జిల్లాలో వచ్చి మేత పెంపకానికి డివిజన్, మండల స్థాయిలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ డీకేటీ, ప్రైవేట్ భూములను ప్రతి మండలంలో కనీసం 3 వేల ఎకరాలను గుర్తించాలన్నారు. ఇందుకు ప్రభుత్వం జారీ చేసిన నూతన మార్గదర్శకాలను దృష్టిలో ఉంచుకోవాలి. జిల్లాలో 2023 డిసెంబరు నుండి 2024 అక్టోబరు 31 మధ్యలో మృతి చెందిన వారి భార్యలకు ప్రభుత్వం నూతనంగా లక్ష ఫించన్లను మంజూరు చేయగా, ఇందులో మన జిల్లాకు 3316 వితంతు పింఛన్లను మంజూరు చేసిందన్నారు. ఇప్పటికే అర్హత కలిగిన దరఖాస్తులకు సంబంధించిన డెత్ సర్టిఫికెట్లను రేపు సాయంత్రంలోగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. అనంతరం జేసీ ఆదర్శ్ రాజేంద్రన్ మాట్లాడుతూ గృహ నిర్మాణానికి సంబంధించి పొజిషన్ సర్టిఫికెట్ల జారీలో ఇంకనూ జిల్లాలో 14శాతం పెండింగ్ ఉందని, ప్రగతిలో వెనుకబడిన మండలాలు లక్ష్యాలను తప్పనిసరిగా అధిగమించాలని తహసీల్దార్లకు సూచించారు. సమావేశంలో డీఆర్వో మధుసూదన్‌రావు, సబ్ కలెక్టర్లు మేఘస్వరూప్, నదియాదేవి, ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్రికెట్ అంపైర్లు, స్కోరర్ల కోసం దరఖాస్తుల ఆహ్వానం

వాల్మీకిపురం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ (సీడీసీఏ) నుంచి అంపైర్లు, స్కోరర్ల కోసం ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయకుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామస్థాయి నుంచి క్రికెట్ అభివృద్ధి చేయడంలో భాగంగా ఈ అవకాశం కల్పిస్తున్నామన్నారు. ఇటీవల విజయవాడలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఎంపీ, ఏసీఏ జిల్లా అధ్యక్షుడు కేసినేని శివనాథ్ (చిన్ని) గ్రామీణ స్థాయిలో క్రికెట్ అభివృద్ధి చేయడంతో పాటు క్రికెటర్లకు ఉపాధి కల్పించనున్నట్లు చెప్పారన్నారు. ఇందులో భాగంగా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విజయకుమార్ తెలియజేశారు. ఆసక్తి గల అభ్యర్థులు కనీసం పదో తరగతి పాసై ఉండాలని, 18 ఏళ్ల నుంచి 40 ఏళ్లలోపు వయసు వారు అర్హులన్నారు. క్రికెట్‌పై మౌలిక అవగాహన ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని, ఆసక్తి గలవారు సీడీసీఏ రూపొందించిన గూగుల్ ఫారంలో సంప్రదించాలన్నారు. ఈనెల 30లోపు దరఖాస్తు చేసుకోవాలని ఇతర వివరాలకు సెల్‌ఫోన్ నెంబర్లు 8886185559, 9000214966లను సంప్రదించాలన్నారు.

హాకీ శిక్షణను సద్వినియోగం చేసుకోండి



మదనపల్లె టౌన్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): జిల్లా శాప్, సెట్విన్ ఆధ్వర్యంలో మదనపల్లెలో నిర్వహించనున్న హాకీ ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. మదనపల్లె బీటీ కళాశాల మైదానంలో ఈ నెల 28 నుంచి 30 వరకు మూడు రోజుల పాటు నిర్వహించే ఈ శిక్షణలో 8 నుంచి 18 ఏళ్లలోపు క్రీడాకారులకు కోచ్ నౌషాద్, సీనియర్ హాకీ క్రీడాకారులు శిక్షణ ఇస్తారన్నారు. వివరాలకు 94923 77889 నెంబర్‌కు ఫోన్ చేయాలని డీఎస్‌వో కోరారు.

పెంచలకోనకు ప్రత్యేక బస్సు సర్వీసు

రాజంపేట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనకు రాజంపేట డిపో నుంచి ప్రత్యేక బస్సు సర్వీసు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ ఎం.రమణయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బస్సు ఉదయం 5.15 గంటలకు రాజంపేటలో బయలుదేరి 6.30 గంటలకు కడప బస్టాండ్‌కు చేరుతుందన్నారు. అనంతరం కడప నుంచి 6.40 గంటలకు పెంచలకోనకు బయలుదేరుతుందన్నారు. చిట్వేలి, రాపూరు మీదుగా ఉదయం 10.45 గంటలకు పెంచలకోనకు చేరుతుందని పేర్కొన్నారు. తిరిగి 11.15 గంటలకు పెంచలకోనలో బయలుదేరి ఇదే మార్గంలో మధ్యాహ్నం 1.45 గంటలకు రాజంపేటకు చేరుకుంటుందని తెలిపారు. తిరిగి 2.15 గంటలకు రాజంపేటలో బయలుదేరి రాపూరుకు 3.45 గంటలకు చేరుకుంటుందని వివరించారు. 4 గంటలకు రాపూరులో బయలుదేరి చిట్వేలి, రాజంపేట మీదుగా కడపకు రాత్రి 7 గంటలకు చేరుకుంటుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



ఆర్టీసీ బస్సు - బొలెరో వాహనం ఢీ

- ఒకరు మృతి.. 14 మందికి గాయాలు


మృతి చెందిన రామాంజుల్‌రెడ్డి

రామాపురం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కర్నూలు-చిత్తూరు 40వ జాతీయ రహదారి రామాపురం మండలం హసనాపురం పంచాయతీ టోల్‌గేట్ సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా 14 మందికి గాయాలయ్యాయి. ఆర్టీసీ బస్సు నిలబడి ఉన్న బొలెరో వాహనాన్ని ఢీకొనడంతో రామాంజుల్ రెడ్డి(80) అనే వ్యక్తి మృతి చెందగా రమాదేవి, జగదీశ్‌బాబు, గీతావాణి, సుమిత్ర, ఆస్మా, రెడ్డిరాణి, విజయ్‌కుమార్‌రెడ్డి, మాన్యత, మహేశ్, రాణమ్మ, చౌడయ్య, జమున, డ్రైవర్ ప్రసాద్‌రెడ్డి, కండక్టర్ నరసింహులుకు గాయాలయ్యాయి. వీరిలో రామాంజుల్‌రెడ్డి, రమాదేవి, జగదీశ్‌బాబు, గీతావాణి, సుమిత్ర వంగిమళ్లకు చెందిన వారు. వీరంతా ఒకే కుటుంబానికి చెందిన వారు. మిగిలిన వారు ఇతర ప్రాంతాలకు చెందినవారు. ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డి కథనం మేరకు.. రాయచోటి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వంగిమళ్ల నుంచి రాయచోటికి వస్తుండగా టోల్‌గేట్ సమీపంలోకి రాగానే బొలెరో వాహనం పంక్చర్ అయింది. దీంతో బొలెరో వాహనానికి టైరు మార్చుతుండగా వెనుకవైపు నుంచి ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. రామాపురం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రామాంజుల్‌రెడ్డి చికిత్స పొందుతూ మృతి చెందారు. రమాదేవి, జగదీశ్‌బాబు, గీతావాణి పరిస్థితి విషమించడంతో కడప రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రెవెన్యూ పెట్రోలు పంపు ఏర్పాటుకు స్థల పరిశీలన


ఐవోసీ ప్రతినిధులతో పీలేరు తహసీల్దారు భీమేశ్వర రావు

పీలేరు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో పీలేరులో పెట్రోలు పంపు ఏర్పాటు కానుంది. ఇందుకు సంబంధించి పీలేరు రెవెన్యూ అధికారులు, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ అధికారులు శనివారం స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా పీలేరు తహసీల్దారు భీమేశ్వరరావు మాట్లాడుతూ రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో పెట్రోలు పంపు ఏర్పాటుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోందని, అందుకు అనువైన స్థలం ఎంపిక చేయాల్సిం దిగా తమకు ఆదేశాలు అందాయన్నారు. దీంతో గూడరేవుపల్లె పంచాయతీ సర్వే నెం.198లో కొత్తగా నిర్మితమవుతున్న నేషనల్ హైవేకు ఆనుకుని 0.75 ఎకరాల భూమి సేకరించామన్నారు. ఆ స్థలాన్ని శనివారం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ చెన్నై శాఖ జనరల్ మేనేజర్ శ్రీనివాసులు, మేనేజర్ రాజ్ కుమార్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. వారు తమ నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తారన్నారు. ఇప్పటికే జైళ్ల శాఖ, ఏపీఎస్‌ఆర్టీసీ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని పలుచోట్ల పెట్రోలు పంపులు నడుస్తుండగా రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలోనూ ఏర్పాటు కానుండడం విశేషం.

ఉత్కంఠభరితంగా బండలాగుడు పోటీలు



ఒంటిమిట్ట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ఒంటిమిట్ట చెరువు కట్టపై వెలసిన కాల గంగమ్మ తిరునాళ్ల సందర్భంగా నిర్వహించిన బండలాగుడు పోటీలు ఉత్కంఠభరితంగా సాగాయి. భక్తులు, ప్రజల కేరింతల మధ్య బండలాగుడు పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీలను రాష్ట్ర మాజీ డైరెక్టర్ ఆకేపాటి వేణుగోపాల్ రెడ్డి ప్రారంభించారు. గెలుపొందిన ఎడ్ల యజమానుల కు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సుబ్బారెడ్డి, శేషారెడ్డి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

రైల్వేకోడూరు జాతరకు వందేళ్లు

- 30 నుంచి మొదలు
- భారీ ఏర్పాట్లు.. పోలీసు బందోబస్తు
- దొంగలను పట్టుకునేందుకు డ్రోన్ కెమెరాతో నిఘా


బలిజవీధిలో వెలసిన గంగమ్మ తల్లి

రైల్వేకోడూరు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రమైన రైల్వేకోడూరు బలిజవీధిలో నిర్వహించే జాతరకు వందేళ్లు నిండాయి. మొదట జాతర ఉత్సవాలను సుగవాసి కుటుంబం మొదలు పెట్టింది. తర్వాత యెలిశెట్టి, ఆ తర్వాత పండ్రా కుటుంబీకులు చేస్తున్నారు. 1925లో జాతరను ప్రారంభించారు. ఈ ఏడాదికి వందేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా జాతర ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ జాతరకు ఒక కమిటీ ఉంది. గంగమ్మతల్లి పేర బలిజవీధిలో సుమారు రూ.80 లక్షలు పెట్టి స్థలాన్ని కొనుగోలు చేసి, ఆ స్థలంలో ఓ దాత కల్యాణ మండపాన్ని నిర్మించారు.

30 నుంచి జాతర

బలిజవీధిలో వెలసిన గంగమ్మ జాతర ఈనెల 30వ తేదీ నుంచి మొదలై మూడురోజుల పాటు జరుగు తుందని నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు ప్రతి వీధిలో విద్యుత్ దీపాలంకరణలు, గంగమ్మ ప్రతిమల తో కూడిన విద్యుత్ బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. 30వ తేదీ నుంచి వేషాలు, విజయవాడ తప్పెట్లు తదితర కార్యక్రమాలతో జాతర ఉత్సవాలు ప్రారంభమవుతాయి. అదేరోజు అర్ధరాత్రి పల్లకీ ఉత్సవం, అ నంతరం అంకాళమ్మ దేవస్థానంలో అమ్మవారి ప్రతి మను బంకమన్నుతో తయారు చేసి వెండి, బంగారు వస్తువులతో అలంకరించి అక్కడి నుంచి మండపం వరకు తీసుకువస్తారు. అమ్మవారు వెళుతుండగా భక్తులు మొక్కులు తీర్చుకుంటారు. మండపం వద్ద వేపమండలతో గుడిని ఏర్పాటు చేసి గంగమ్మతల్లిని నిలబెడతారు. ఆ రోజంతా భక్తులకు దర్శనం కల్పిస్తారు. మే 2వ తేదీ ఉదయాన్నే ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని నిమజ్జనానికి తీసుకెళతారు. దీంతో జాతర ముగుస్తుంది. ఈ జాతరకు తిరుపతి, కడప, వెంకటగిరి, రాజంపేట, నెల్లూరు, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుండి భక్తులు వస్తారు.

జాతరకు పటిష్ట బందోబస్తు..



రైల్వేకోడూరులో నిర్వహించే జాతరను ఎలాంటి సమస్యలు లేకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం. జాతరలో డ్రోన్ నిఘా పెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం. దొంగలను పట్టుకోవడానికి బందోబస్తును ఏర్పాటు చేస్తున్నాం. ఈ మేరకు జాతర నిర్వాహకులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చాం.

- మనోజ్‌రామనాథ్‌హెగ్డే, రాజంపేట ఏఎస్పీ




చలువపందిళ్లు

10 నుంచి దేవుని కడప శ్రీవారి తెప్పోత్సవాలు

కడప కల్చరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): తిరుమల తొలిగడప దేవుని కడప శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారి తెప్పోత్సవాలు మే 10వ తేదీ నుంచి 12వ తేదీ వరకు జరుగనున్నాయి. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లు ఆలయ పుష్కరిణిలో ప్రతి రోజూ సాయంత్రం 6 గంటలకు తెప్పలపై విహరించి భక్తులను కటాక్షించనున్నారు. అందులో భాగంగా మే 10న శ్రీకృష్ణ సమేత గోదాదేవి మూడు చుట్లు, 11న శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర-స్వామి ఐదు చుట్లు, 12న శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీ వేంకటేశ్వరస్వామి వారు ఏడు చుట్లూ తెప్పలపై తిరిగి భక్తులకు కనువిందు చేయనున్నారు. కాగా ఆ మూడు రోజులలో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు స్నపన తిరుమంజనం, సాయంత్రం 5-30 నుంచి 6 గంటల వరకు తిరువీధి ఉత్సవం నిర్వహించనున్నారు. అలాగే ఆలయంలో హిందూ ధర్మ ప్రచార పరిషత్, దాస సాహిత్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగనున్నాయి. భక్తులు తెప్పోత్సవాలను తిలకించి స్వామివారి సేవలో తరించాలని ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్ రెడ్డి కోరారు.

ప్రమాదాల దారి.. నాలుగు రోడ్ల రహదారి

- 15 నెలల్లో 18 మంది మృతి
- వాహనచోదకుల నిర్లక్ష్యంతో ప్రమాదాలు
- వీధిన పడుతున్న కుటుంబాలు


క్రీస్తురాజపురం వద్ద ప్రమాదకరంగా మారిన రోడ్లు కలిపే జంక్షన్

దువ్వూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): చిన్నపాటి నిర్లక్ష్యం నిండుప్రాణాలకు ముప్పు తెస్తోంది. అతి వేగం, రోడ్డు నిబంధనలు పాటించకపోవడంతో జాతీయ రహదారిపై తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో ఎంతో మంది మృత్యువాత పడుతుండగా.. వారి కుటుంబీకులు దిక్కులేని వారవుతున్నారు. మరికొందరు క్షతగాత్రలు అవిటివారుగా మిగిలిపోతున్నారు.

దువ్వూరు మండల పరిధిలోని నాలుగు రోడ్ల రహదారి రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. అధికారులు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా ప్రమాదాలకు అడ్డుకట్ట పడటంలేదు. ఇక్కడ తరచూ వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. ఈ పరిస్థితి ఇడమడక, కానగూడూరు, జిల్లేళ్ల, దువ్వూరు బైపాస్, క్రీస్తురాజపురం, గుడిపాడు, చింతకుంట సమీపంలో నెలకొంది. బైపాస్ రోడ్డుపైకి గ్రామాల్లో నుంచి వచ్చే వాహనదారులు అజాగ్రత్తగా వాహనాలు నడపడమే ఇందుకు కారణమని తెలుస్తోంది.

15 నెలల్లో 18 మంది మృతి

దువ్వూరు మండల పరిధిలో 2024 జనవరి నుండి ఈయేడు మార్చి వరకు జరిగిన రోడ్డు ప్రమాదాలను గమనిస్తే 18 మంది మృత్యువాతన పడ్డారు. మరో 20 మంది గాయపడిన వారిలో ఉన్నారు. వారిలో కొందరు అవిటివారిగా జీవనం కొనసాగిస్తున్నారు.

ప్రమాదాలకు ఇవే కారణాలు

- ప్రైవేటు ట్రావెల్స్ అతివేగంగా వెళుతూ అదుపు తప్పి బోల్తాపడుతున్నాయి.
- కొన్ని చోట్ల సూచిక బోర్డులు సరిగా లేకపోవడం, వాహనదారులకు ఇబ్బంది కలిగిస్తోంది.
- డ్రైవర్లు వాహనాలు నడిపే సమయంలో సెల్‌ఫోన్లలో మాట్లాడడం ప్రమాదాలకు కారణమవుతోంది.
- ఎక్కువగా యువత మద్యం సేవించి బైకులు నడపడం మరో కారణం.
- ఆటోలలో పరిమితికి మించి జనాలను ఎక్కించుకుని వెళ్లడం.
- నాలుగు రోడ్ల రహదారి ఎక్కే సమయంలో అజాగ్రత్తగా వాహనాలు నడపడం.
- లైసెన్సులు లేకుండా బైకులు నడపడం, హెల్మెట్లు ధరించకపోవడం లాంటి కారణాలు రోడ్డు ప్రమాదాలకు కారణం అవుతున్నాయి.

మార్కెట్ యార్డులో మౌలిక వసతుల కల్పనకు చర్యలు : జేడీ


మాట్లాడుతున్న మార్కెటింగ్‌శాఖ జేడీ రామాంజనేయులు

కడప రూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కడప పసుపు మార్కెట్ యార్డులో మౌలిక వసతుల కల్పనకు వీలైనంత త్వరలో తగు చర్యలు తీసుకుంటామని మార్కెటింగ్‌శాఖ జాయింట్ డైరక్టర్ రామాంజనేయులు పేర్కొన్నారు. శనివారం మార్కెట్ యార్డులో పసుపు కొనుగోలు, కమిషన్ ఏజెంట్లతో సమావేశమై సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా పలువురు కమిషన్ ఏజెంట్లు మార్కెట్ యార్డులో మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యం, వీధి దీపాలను ఏర్పాటు చేయాలని కోరారు. ఇందుకు జేడీ రామాంజనేయులు సానుకూలంగా స్పందించారు. రెండు, మూడు రోజుల్లో తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో మార్కెట్‌యార్డు కార్యదర్శి సుజాత, సూపర్‌వైజర్ గంగన్న, మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, కోశాధికారి గుర్రం కొండ మహేష్, సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ శిల్పకళా దినోత్సవం


శిల్పకళా ప్రదర్శనలో విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ శిల్పకళా దినోత్సవం సందర్భంగా డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ, స్కల్చర్ విభాగం విద్యార్థుల కళా ప్రదర్శనను ఘనంగా నిర్వహించారు. శనివారం విద్యార్థుల శిల్పకళా ప్రతిభను ఉద్దాటిస్తూ, కళాకృతుల ప్రదర్శనను నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ ప్రొఫెసర్ జి. విశ్వనాథ్ కుమార్, విద్యార్థుల శిల్ప ప్రదర్శనను అభినందిస్తూ ఈ వేడుక ద్వారా విశ్వ విద్యాలయం సృజనాత్మకతను ప్రోత్సహించడంలో, భవిష్యత్ కళాకారులను ప్రేరేపించడంలో, శిల్పకళా రంగానికి మద్దతు ఇవ్వడంలో తన నిబద్ధతను మరోసారి నిరూపించుకుందన్నారు. ప్రదర్శనకు ఏర్పాట్లు చేసిన శిల్పకళ విభాగ అధ్యాపకులను, విద్యార్థులను వీసీ అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి


సుభాష్‌చంద్రబోస్ మృతదేహం

చాపాడు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు-మైదుకూరు జాతీయ రహదారిలోని మండల కేంద్రం చాపాడు వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సీబీఐటీ కళాశాల విద్యార్థి కామనూరు సుభాస్ చంద్రబోస్ (18) మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు... దువ్వూరు మండలంలోని కృష్ణంపల్లె గ్రామానికి చెందిన సుబాస్ చంద్రబోస్ సీబీఐటీ కాలేజీలో డిప్లమా మొదటి సంవత్సరం చదువుతున్నాడు. చియ్యపాడు గ్రామంలో అతని బంధువుల ఇంటిలో ఉండి చదువుకుంటున్నాడు. శనివారం ఉదయం 8.30 గంటల సమయంలో పరీక్ష రాసేందుకు సీబీఐటీ కాలేజీకిమోటారు సైకిల్‌పై వెళుతుండగా ఎదురుగా గేదె రావడంతో దాన్ని ఢీకొని కిందపడ్డాడు. దీంతో అతని తలకు బలమైన గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 వాహనంలో ప్రొద్దుటూరులోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మోటారు సైకిల్‌పై వెనుకవైపు కూర్చొని ఉన్న అతని స్నేహితుడు శృతికుమార్ కూడా గాయపడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి..


భాస్కర్‌రెడ్డి మృతదేహం

పులివెందుల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పట్టణంలోని నారాయణ కళాశాల సమీపంలో నివాసముంటున్న రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి భాస్కర్‌రెడ్డి (55) అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. శనివారం ఉదయం ఈ ఘటన బయట పడింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా.. భాస్కర్‌రెడ్డి నారాయణ కళాశాల సమీపంలోని ఓ ఇంట్లో నివాసముంటున్నారు. అతని భార్య, కుమారుడు మరొకచోట ఉంటున్నారు. వీళ్లకు కుటుంబ కలహాలు ఉన్నాయి. కాగా, భాస్కర్‌రెడ్డి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఏం జరిగిందో ఏమో కానీ శనివారం ఉదయం ఆయన నిద్రలేవకపోవడంతో చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించగా అప్పటికే మృతి చెందాడు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ మురళీనాయక్ వెల్లడించారు.

లారీ, కారు ఢీ... వార్డు కౌన్సిలర్ మృతి


మృతిచెందిన షేక్ ఖాదర్‌బాషా (ఫైల్)

బ్రహ్మంగారిమఠం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేకలకుంట పంచాయతీ జెడ్.కొత్తపల్లె గ్రామ సమీపాన జాతీయ రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మైదుకూరు మున్సిపాలిటీ ఐదో వార్డు కౌన్సిలరు షేక్ ఖాదర్‌బాషా మృతి చెందాడు. బి.మఠం ఎస్ఐ చంద్రశేఖర్ వివరాల మేరకు... మైదుకూరు మండలం నుంచి ఖాదర్ బాషా కారులో బద్వేలుకు వెళుతున్నాడు. అదే సమయంలో బద్వేలు నుంచి మైదుకూరు వైపు వస్తున్న బొగ్గులారీ ఢీకొంది. దీంతో ఖాదార్‌బాషా అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కాగా, ఖాదర్‌బాషా మృతి పట్ల ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ ఫోన్ ద్వారా సంతాపం తెలిపి.. వారి కుటుంబ సభ్యులకు ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. పలువురు టీడీపీ నేతలు ఖాదర్ బాషా మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళిలర్పించారు.

బ్రహ్మంసాగర్‌లో పడి వ్యక్తి మృతి


వీరబ్రహ్మం మృతదేహం

బ్రహ్మంగారిమఠం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మంసాగర్ ప్రాజెక్టులో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న ఎస్ఐ చంద్రశేఖర్ సిబ్బందితో కలసి సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటికి తీశారు. అతని వద్ద ఉన్న ఆధారాలను పరిశీలించి విజయవాడలోని మైలవరం మండలానికి చెందిన వీరబ్రహ్మం (40)గా గుర్తించామన్నారు. ఈ విషయం వారి బంధువులకు తెలిపామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బద్వేలుకు తరలించామని.. బంధువులు వచ్చిన వెంటనే ఫిర్యాదు స్వీకరించి కేసు నమోదు చేస్తామని తెలిపారు.

డబ్బుల కోసం బెదిరింపు.. కేసు నమోదు

మైదుకూరు రూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): డబ్బులు ఇవ్వకుంటే చంపుతానని బెదిరించి, చంపే ప్రయత్నం చేశారని రైస్ మిల్లు యజమాని సూరిశెట్టి ప్రసాద్ గుప్తా శనివారం మైదుకూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసుల సమాచారం మేరకు సూరిశెట్టి ప్రసాద్ రైస్ మిల్లు యజమాని. అతన్ని రేషన్ బియ్యం కొనుగోలు చేసి వాటిని పాలీస్ పట్టించి అక్రమవ్యాపారం చేస్తున్నావని చొక్కం అంజనేయులు అనే వ్యక్తి బెదించి డబ్బులు డిమాండ్ చేశాడు. బియ్యం టెస్ట్ చేసే ఇనుప కమ్మితో చంపడానికి బెదించాడని సూరిశెట్టి ప్రసాద్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి ఆంజనేయులును అరెస్టు చేసి కమలాపురం సబ్ జైల్‌కు రిమాండ్‌కు పంపినట్లు పోలీసులు తెలిపారు.

పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

- డీఎఫ్‌వో వినీత్‌కుమార్



డాక్టర్ కె.డి. వరప్రసాద్‌రావు డాక్టర్ ఎస్ లావణ్య లక్షిలకు జ్ఞాపికలను అందజేసి సత్కరిస్తున్న డీఎఫ్‌వో వినీత్‌కుమార్, జేడీ శారదమ్మ తదితరులు

కడప రూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పశువులు, జంతువుల ఆరోగ్యం సంక్షేమంపై పశువైద్యాధికారులు, శాస్త్రవేత్తలు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా అటవీశాఖ అధికారి వినీత్‌కుమార్ పేర్కొన్నారు. కడప నగరం కోటిరెడ్డి సర్కిల్‌లోని జిల్లా పశువైద్యశాఖ కార్యాలయంలో ప్రపంచ పశు వైద్య దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. జంతు ఆరోగ్యంతో పాటు వాటి పరిరక్షణ, సంక్షేమం కొరకు అంకిత భావంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. జంతువుల జీవన ప్రమాణాలను మెరుగు పరచాలన్నారు. వన్య ప్రాణుల సంరక్షణలో కూడా పశువైద్యులు పాత్ర ముఖ్యమన్నారు. వారి సేవలు గొప్పవని ప్రశంశించారు. పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి శారదమ్మ మాట్లాడుతూ పశువైద్య విశిష్టతను చాటి చెప్పేందుకు పశువైద్య దినోత్సవాన్ని నిర్వహించడం జరుగుతోందన్నారు. పశువైద్యశాఖలో పనిచేసే ప్రతి ఒక్కరు జంతువుల నుంచి మానవులకు వ్యాపించే వ్యాధులను నివారించి, నియంత్రిస్తున్నామన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వస్తున్న టెక్నాలజీ సమాచారాన్ని పశుపోషకులకు ఎప్పటికప్పుడు అందజేస్తున్నామన్నారు. జంతు సంబంధిత ఆహార ఉత్పత్తుల భద్రత కు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. జంతువుల ఆరోగ్యం, సంక్షేమం, ఉత్పాదకతను మెరుగు పరచడానికి పరిశోదనలు నిర్వహిస్తోందన్నారు. అనంతరం మెరుగైన పశువైద్య సేవలను అందించిన. సీనియర్ వెటరనరీ వైద్యు లు డాక్టర్ కేడీ వరప్రసాద్‌రావు, డాక్టర్ ఎస్.లావణ్య లక్షిలకు జ్ఞాపికలను అంద జేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కడప, పులివెందుల తదితర విపిసి డిప్యూటీ డైరక్టర్లు రమణయ్య, మంగేశ్, రంగస్వామి, రాజశేఖర్, ఏడిలు ఉమా, వెంకటసుబ్బయ్య, శివరామిరెడ్డి, శ్రీదర్‌లింగారెడ్డి, మారుతీతో పాటు, డాక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీ... పొడదుప్పి మృతి



నీకేదిన్నె, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని పొడదుప్పి మృతి చెందింది. కడప-రాయచోటి జాతీయ రహదారిలోని జమాల్‌పల్లి సమీపంలో శనివారం ఉదయం రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో గాయపడిన దుప్పి అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికులు అటవీశాఖ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని దుప్పికి పోస్టుమార్టం నిర్వహించి ఖననం చేసినట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


మేఘనాథ్‌రెడ్డి మృతదేహం

లింగాల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): సింహాద్రిపురం మండలం బిదినంచెర్ల గ్రామానికి చెందిన నల్లపురెడ్డి మేఘనాథ్‌రెడ్డి శనివారం ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురికావడంతో మృతి చెందాడు. ఎస్ఐ మదుసూధన్‌రావు కథనం మేరకు వివరాలిలా.. మేఘనాథరెడ్డికి లింగాల మండలం వెలిదండ్ల గ్రామ పొలంలో చీనీ తోట ఉంది. తోటకు నీరందించడానికి మధ్యాహ్న సమయంలో ఇంటి వద్ద నుంచి వెళ్లి స్టార్టర్‌ను ఆన్‌చేసే క్రమంలో విద్యుదాఘాతానికి గురయ్యాడు. భర్త ఎంత సేపటికి ఇంటికి రాకపోవడంతో మేఘనాథ్‌రెడ్డి భార్య లక్ష్మీ తోట వద్దకు వెళ్లి చూడగా అప్పటికే మృతి చెందాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

కల్లూరుపల్లెను గ్రీన్ విలేజ్‌గా చేస్తాం..

- అసిస్టెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వినోద్‌కుమార్


కల్లూరుపల్లె తాండాలో ప్రజలతో మాట్లాడుతున్న అసిస్టెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్

చక్రాయపేట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కల్లూరుపల్లె తాండాను గ్రీన్ విలేజ్-ఐడీ ఫ్రీగా ప్రకటించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అసిస్టెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వినోద్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని కల్లూరుపల్లె తాండాలో కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమంగా తయారు చేసే మద్యం, డ్యూటీ చెల్లించని మద్యం, గంజాయి, ఇతర మత్తు పదార్థాలను గుర్తించడం, అనుమానితుల ఇళ్లు, పాత నిందితుల ఇళ్లు సమగ్రంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ నవోదయం 2.0 కార్యక్రమం కింద ఈ ఆపరేషన్ చేపట్టామన్నారు. ఇప్పటికే ప్రత్యామ్నయ జీవనోపాధి కింద కొందరిని గుర్తించి ప్రభుత్వం తరపున లోన్లు ఇప్పించే ప్రతిపాదనలు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పులివెందుల ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ చెన్నారెడ్డి, చక్రాయపేట ఎస్ఐ కృష్ణయ్య, ఆర్కేవ్యాలీ ఇన్‌స్పెక్టర్ ఉలసయ్య, ముద్దనూరు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ విన్నీలత, ఈఎస్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథ్‌రెడ్డి, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ నీలకంఠేశ్వరరెడ్డి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పహల్గాం మారణకాండను నిరసిస్తూ జర్నలిస్టుల ర్యాలీ



క్యాండిల్ ర్యాలీలో ఏపీయూడబ్ల్యూజే ప్రతినిధులు

కడప ఎర్రముక్కపల్లె, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): జమ్మూ-కాశ్మీర్ పహల్గాం మతోన్మాద మారణకాండను నిరసిస్తూ ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. శనివారం సాయంత్రం ఏపీయుడబ్ల్యూజే, ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా, వీడియో గ్రాఫర్, ఫొటో గ్రాఫర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో కోటిరెడ్డి సర్కిల్ నుంచి ఎర్రముక్క పల్లె సర్కిల్ అమరవీరుల స్థూపం వరకు ప్రదర్శన నిర్వహించారు. పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని వ్యతి రేకిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఉగ్రదాడిలో మర ణించిన వారికి నివాళులు అర్పించారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ ఉగ్రదాడిని పిరికిపంద చర్యగా అభివర్ణించారు. టెర్రరిజం నిర్మూలనకు ప్రతి ఒక్కరు సహ కరించాలని కోరారు. మతంపేరుతో మారణహోమం సృష్టించిన పాకిస్థాన్ తీవ్రవాదులకు ఎలా బుద్ధి చెప్పాలో భారతదేశ ప్రభుత్వానికి, ప్రజలకు తెలుసన్నారు. కార్యక్రమంలో ఏపీ యూడబ్ల్యూజే జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలకృష్ణారెడ్డి, శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీను, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, గౌరవాధ్యక్షుడు శ్రీనాథ్, ఆంధ్రజ్యోతి బ్యూరో ఎక్కంటి ఆంజనేయులు, ఏబీఎన్ కరస్పాండెంట్ శ్రీనివాసులు, కెమెరామెన్ సంఘం నాయకులు శ్రీనివాసులు, పెద్ద సంఖ్యలో మీడియా ప్రతి నిధులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

● మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

రాజంపేట టౌన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతిఒక్కరి బాధ్యతగా వ్యవహరించాలని మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాసులు తెలిపారు. శనివారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో పరిశుభ్రతను పరిశీలించారు. పట్టణంలోని ప్రజలు తమ ఇళ్లు, షాపుల్లోని చెత్తను బాధ్యతారాహిత్యంగారోడ్లపై, కాలువల్లో పడవేస్తున్నారన్నారు. వాటిని మున్సిపాలిటీ వారు ఏర్పాటు చేసిన చెత్తకుండీల్లో వేయడం లేదన్నారు. దీంతో పారిశుధ్య కార్మికులు శ్రమిస్తున్నా ఫలితం కనిపించడం లేదన్నారు. కావున ప్రతిఒక్కరూ కుండీల్లో వేయాలని, లేకపోతే కార్మికులకు అందించాలని కోరారు. రాజంపేట మున్సిపాలిటీని క్లీన్ సిటీగా మారుద్దామన్నారు.

పూర్వ విద్యార్థుల సమావేశం



మాట్లాడుతున్న మాచినేని విశ్వేశ్వరనాయుడు

రైల్వేకోడూరు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని కే. బుడుగుంటపల్లె వద్ద ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం పూర్వపు విద్యార్థుల సమావేశం ప్రిన్సిపాల్ ఎం. భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వపు విద్యార్థి ప్రముఖ పారిశ్రామికవేత్త మాచినేని విశ్వేశ్వరనాయుడు మాట్లాడుతూ తాము చదువుకున్న డిగ్రీ కళాశాలను అభివృద్ధి చేయడానికి ముందుంటామన్నారు. వైస్ ప్రిన్సిపాల్ రమేష్, పూర్వపు విద్యార్థి, ప్రముఖ న్యాయవాది ఆర్‌సీ సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర సైన్స్ సిటీ సీఈవోకు ఘన సత్కారం



సైన్స్ సిటీ సీఈవో వెంకటేశ్వర్లునాయుడిని సన్మానిస్తున్న కూటమి నేతలు

రాజంపేట టౌన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సైన్స్ సిటీ సీఈవోగా బాధ్యతలు చేపట్టి మొదటిసారి రాజంపేటకు విచ్చేసిన మండలం కొల్లావారిపల్లెకు చెందిన వెంకటేశ్వర్లును ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో కూటమి నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలలు, శలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తనమీద నమ్మకం ఉంచి అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తానన్నారు. కాగా పసుపులేటి చంద్రశేఖర్ తన కుమారుడైన గంగాధర్‌సాయిని అన్యాయంగా తొలగించారని విద్యుత్‌శాఖ అధికారుల తీరుపై వినతిపత్రం అందజేశారు. టీడీపీ నేతలు టి.లక్ష్మీనారాయణ, ఇడిమడకల కుమార్, వెంకటేశ్వర్లునాయుడు, గుగ్గిళ్ల చంద్రమౌళి, మనుబోలు వెంకటేశ్వర్లు, షామీర్‌బాషా, పి.రమేష్‌నాయుడు, కొల్లావారిపల్లె, మిట్టమీదపల్లె, మేకవారిపల్లె నేతలు పాల్గొన్నారు.

జమ్మూకశ్మీర్ హత్యాకాండపై హోరెత్తిన నిరసనలు



కశ్మీర్ ఘటనపై రాయచోటిలో నిరసన చేపడుతున్న న్యాయవాదులు



గాలివీడులో కొవ్వొత్తుల నిరసన



లక్కిరెడ్డిపల్లెలో: శాంతియుత ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

రాయచోటిటౌన్/రాజంపేటటౌన్/పుల్లంపేట/గాలివీడు/రైల్వేకోడూరు రూరల్, ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి): జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దారుణ హత్యాకాండను ఖండిస్తూ శనివారం రాయచోటి కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు నిరసన ర్యాలీ నిర్వహించారు. రాయచోటి కోర్టు నుంచి న్యాయవాదులు, ప్రజాసంఘాలు, న్యాయవాద గుమస్తాలు కలిసి రా యచోటి తహసీల్దార్ కార్యాలయం, పాత బస్టాండు, నేతాజీ సర్కిల్ వరకు నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. రాయచోటి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్. ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రెడ్డిబాషా, భారత న్యాయవాదుల సంఘం ఉమ్మడి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ టీ. ఈశ్వర్, ఎమ్మార్పీఎస్ నాయకులు రామాంజులు, రజక సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.







పుల్లంపేటలో కొవ్వొత్తుల ర్యాలీలో అఖిలపక్ష నాయకులు... రాజంపేటలో ముస్లింల కొవ్వొత్తుల ర్యాలీ... కోడూరులో ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ సభ్యుల నిరసన

భక్తిశ్రద్ధలతో సీతారాముల కల్యాణం



పి.కొత్తపల్లెలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

పెనగలూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పి.కొత్తపల్లెలో శుక్రవారం రాత్రి సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. మండల మాజీ వైస్ ఎంపీపీ బచ్చల సుమతమ్మ, టీడీపీ నాయకులు బీఎల్ నరసింహారెడ్డి దంపతుల ఆధ్వర్యంలో బీసీ సుబ్బనరసయ్య పండితుల బృందం కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. టీడీపీ నియోజకవర్గ నాయకురాలు ముక్కా వరలక్ష్మి పాల్గొని సీతారామ లక్ష్మణ, ఆంజనేయుల ఉత్సవరులకు పూజలు నిర్వహించారు. కొత్తపల్లె గ్రామ పెద్దలు, యూత్ అసోసియేషన్ సభ్యులు ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ, అల్పాహారం అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు, మాజీ డీసీసీబీ డైరెక్టర్ లేబాక శ్రీనివాసులరెడ్డి, బత్తిన వేణుగోపాల్‌రెడ్డి, జి.రెడ్డయ్యరెడ్డి, ఎల్.రెడ్డయ్య, వి.పాల్‌రెడ్డి, కె.కళాచంద్ర, ఎం.విశ్వనాథ్‌రెడ్డి, బచ్చల వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ.1.50 లక్షలతో వెండి కిరీటాల వితరణ

పి.కొత్తపల్లె కోదండరామస్వామి దేవాలయంలో మూలమూర్తులకు ఇదే గ్రామానికి చెందిన దువ్వూరు లక్ష్మీదేవి, రాఘవరెడ్డి దంపతులు రూ.1.50 లక్షలతో సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి వార్లకు వెండి కిరీటాలు చేయించి శుక్రవారం దేవాలయ కమిటీ సభ్యులకు అప్పగించారు. వాటిని మూలమూర్తులకు అలంకరించినట్లు గ్రామ పెద్ద మీగడ విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు.

కూటమి సర్కార్‌తోనే రాష్ట్ర అభివృద్ధి

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా

రాయచోటిటౌన్, ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి): కూటమి సర్కార్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, కుప్పం నియోజకవర్గ పరిశీలకుడు గాజుల ఖాదర్‌బాషా పేర్కొన్నారు. శనివారం ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నిరుద్యోగుల భవిష్యత్తు గురించి ఆలోచిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి నారా చంద్రబాబు అన్నారు. చంద్రబాబు పుట్టిన రోజున డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసి 16,347 పోస్టులను భర్తీ చేసేందుకు సిద్ధమైన ఏకైక ప్రభుత్వం తెలుగుదేశం ప్రభుత్వం అని తెలిపారు. ఎన్నికల్లో చెప్పిన హామీ ప్రకారం సముద్రంలో వేట విరామ సమయంలో మత్స్యకారులకు ఆర్థిక సాయం ఒక్కో మత్స్యకార కుటుంబానికి రూ.20 వేలు ఇచ్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రీకాకుళం జిల్లాలో శ్రీకారం చుట్టారన్నారు.

భూ సమస్యలపై పరిష్కారం కనుగొనండి

రైల్వేకోడూరు రూరల్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని భూ సమస్యలపై సిబ్బంది త్వరిత గతిన పరిష్కారం కనుగొనాలని రైల్వేకోడూరు తహసీల్దార్ మహబుబ్ చాంద్ తెలిపారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో జేసీ నిర్వహించిన సమవేశంలో మండల అధికారులతో కలిసి పాల్గొన్నారు. డీటీ శివకుమార్, ఆర్ఐ లక్ష్మీదేవి, వీఆర్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ విద్య

నందలూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలో క్రమశిక్షణతో కూడిన ఉత్తమమైన విద్యను నేర్పించడం జరుగుతుందని ఎంఈవోలు నాగయ్య, అనంతకృష్ణ పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ఆర్‌ఎస్‌రోడ్డులో ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యపై ప్రచారం చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఎస్టీయూ మండల జనరల్ సెక్రటరి లీలాక్రిష్ణయ్య, ప్రెసిడెంట్ షఫీవుల్లా, మహేశ్వరబాబు, సంజీవప్రసాద్, అల్లం అశోక్‌కుమార్, రమేష్‌బాబు, కృపానందం, లక్ష్మీరాజ్యం, లక్ష్మీకాంతమ్మ, గాయత్రిదేవి పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి



మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ఆవుల నాగశ్రీలక్ష్మి

సంబేపల్లె, ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి):గ్రామాల్లో తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ఎంపీపీ ఆవుల నాగశ్రీలక్ష్మి తెలిపారు. శనివారం ఎంపీడీవో సభా కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగశ్రీలక్ష్మి మాట్లాడుతూ మే, జూన్ నెలలో నీటి సమస్య ఉన్న గ్రామాలను గుర్తించి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలన్నారు. ప్రస్తుతం ఒక్కో ట్యాంకర్‌కు రూ.515 చెల్లిస్తున్నట్లు ఆర్‌డబ్ల్యుఎస్ జేఈ మహేశ్వరి తెలిపారు. రూ.515 గిట్టుబాటు కాక ట్యాంకర్ల ద్వారా నీరు తోలడానికి ఎవరూ ముందుకు రానట్లు సర్పంచులు, ఎంపీటీసీలు తెలియజేశారు.

ట్యాంకర్ల వాళ్లకు గిట్టుబాటు కాని విషయం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు అధికారులు తెలిపారు. మోడల్ స్కూల్‌లో భవనాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, త్వరగా పనులు చేయాలని మినిట్స్ బుక్‌లో నమోదు చేశారు. సమావేశంలో తదితర శాఖలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ గొర్ల కవిత, తహసీల్దార్ సుబ్రమణ్యంరెడ్డి, ఎంపీడీవో రామచంద్ర, ఉప మండల అధ్యక్షులు రవీంద్రనాయుడు, మీసాల భాగ్యమ్మ, సర్పంచులు, ఎంపీటీసీలు, అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మట్టిలో మాణిక్యం మేఘన: ఎస్టీయూ



మేఘనను సన్మానిస్తున్న ఎస్టీయూ నేతలు

రాయచోటిటౌన్, ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి): మట్టిలో మాణిక్యం మేఘన అని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు అంశం శివారెడ్డి కొనియాడారు. శనివారం పెద్దివీడు రెడ్డివారిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివి 595 మార్కులు సాధించిన రాసింటి మేఘనను ఎస్టీ యూ అన్నమయ్య జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. శాలువాతో సత్కరించి రూ.10 వేలు నగదు బహుమతిని అందజేశారు. సీనియర్ నాయకులు రవీంద్రనాథ్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ మురళికుమార్, రీజినల్ కన్వీనర్ వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'రఘురామకృష్ణంరాజు క్షమాపణ చెప్పాలి'

రాయచోటిటౌన్, ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి): సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావుకు డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు క్షమాపణ చెప్పాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అబ్బవరం రామాంజులు డిమాండ్ చేశారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ భీమరంలో శ్రీనివాసరావుపై రఘురామకృష్ణంరాజు చేసిన అనుచిత వ్యాఖ్యలను సీపీఎం తప్పుపడుతోందన్నారు.

ఆర్‌సీసీ పైపులు తొలగించాలి

సంబేపల్లె, ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి): కర్నూలు- చిత్తూరు జాతీయ రహదారి నారాయణరెడ్డిపల్లె నర్సరీ వద్ద రోడ్డు సైడ్ ఉన్న ఆర్‌సీసీ పైపులు తొలగించాని మైనార్టీ హక్కుల సంఘం నాయకులు సగీర్ శనివారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. నారాయణరెడ్డిపల్లెలో నేషనల్ హైవే సర్వే నెంబర్ 68 నర్సరీ దగ్గర రోడ్డు సైడు అడ్డంగా ఆర్‌సీసీ నిలువ చేశారన్నారు. దీంతో వాహనదారులకు ఇబ్బందిగా ఉందని తెలియజేశారు. పైపులు తొలగింపునకు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సుబ్రమణ్యంరెడ్డి తెలిపారన్నారు.

పేదలకు అన్నదానం

చిట్వేలి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి):మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చిట్వేలి శాఖ ఆధ్వర్యంలో శనివారం పేదలకు అన్నదానం చేశారు. చిట్వేలికి చెందిన పూజారి గౌరీశంకర్ మొదటి వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యులు హరిత, హేమంత్, షణ్ముఖ, ప్రియా నాగలక్ష్మీ, స్థానిక శివాలయం వద్ద అన్నదానం చేశారు.

వాహనపత్రాలు తప్పనిసరి

నందలూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : వాహనదారులకు పత్రాలు తప్పనిసరి అని, అన్ని పత్రాలను తమ వాహనంలో తప్పకుండా ఉంచుకోవాలని రాజంపేట రూరల్ సీఐ బీవీ రమణ అన్నారు. మండలంలోని లేబాక గ్రామంలో శనివారం నాకాబందీ నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అడిషనల్ ఎస్పీ వెంకటాద్రి సూచనల మేరకు ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. గ్రామస్థులకు మైనర్ డ్రైవింగ్ గురించి కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. రికార్డులు లేని 12 మోటారు సైకిళ్లను పోలీసుస్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

దొంగ పింఛన్లు తొలగించాలి

సుండుపల్లె, ఏప్రిల్26 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తీసుకుంటున్న పింఛన్లను తొలగించాలని ఏపీ బంజారా సంఘం మండల అధ్యక్షుడు రాజశేఖర్ ఎంపీడీవో సుధాకర్‌రెడ్డికి శనివారం వినతిపత్రం అందజేశారు. గుండపల్లి పంచాయతీ జేసీ కుర్వపల్లిలో ఒకే కుటుంబంలో ముగ్గురు దొంగ పింఛన్లు తీసుకుంటున్నారని, వాటిని తొలగించాలని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

29న మండల సర్వసభ్య సమావేశం

గాలివీడు, ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఈ నెల 29వ తేదీ మంగళవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ జల్లా పద్మావతమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జవహర్‌బాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, మండల అధికారులు పాల్గొనాలని కోరారు.

30న మండల మీట్

రాజంపేట టౌన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట మండల సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 30న ఎంపీడీవో కార్యాలయ సభాభవనంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వరప్రసాద్ పేర్కొన్నారు.పలు అంశాలపై చర్చించే విధంగా అజెండాలో ఉంచామని తెలిపారు. మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అన్నిశాఖల అధికారులు హాజరు కావాలని తెలిపారు.

వితంతు పింఛన్లకు దరఖాస్తు చేసుకోవాలి

పెనగలూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : పెనగలూరు మండలంలో 2023 డిసెంబరు నుంచి 2024 అక్టోబరు వరకు 10 నెలల కాలంలో పింఛను వస్తూ మరణించి వ్యక్తి భార్యకు వితంతు పింఛనుకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో విజయరావు తెలిపారు. భర్త మరణ ధ్రువీకరణ పత్రంతో పాటు ఫ్యామిలీ మెంబరు సర్టిఫికెట్‌తో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు అవకాశాలు

ఓబులవారిపల్లె, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్యకు ఒకటో తరగతిలో 25 శాతం ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైందని విద్యాశాఖాధికారులు చక్రధర్‌రాజు, రెడ్డయ్య తెలిపారు. ఈ సీట్లను బడుగు, బలహీనవర్గాలు, తల్లిదండ్రులు లేని పిల్లలకు, ఎస్సీ, ఎస్టీలకు సంవత్సరాదాయం రూ.1.20 లక్షల లోపు ఉన్న బీసీ, ఓసీ, మైనార్టీవారు కూడా అర్హులేనన్నారు. ఈనెల 28 నుంచి మేనెల 15 వరకు ఆన్‌లైన్‌ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చునని, వివరాలకు ఓబులవారిపల్లె విద్యాశాఖ కార్యాలయంలో కాని, సచివాలయంలో గాని సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయండి : డీఎస్పీ

సిద్దవటం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కడప - చెన్నై జాతీయ రహదారి హిందుస్థాన్ పెట్రోలియం, భాకరాపేట రైల్వేస్టేషన్ ప్రాంతాలను శనివారం కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ జమ్మూకశ్మీర్ పహల్గామ్ ఉగ్రవాదుల దాడుల నేపథ్యంలో కడప ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాలతో సిద్దవటం మండలంలో కేంద్ర ప్రభుత్వ పరిధిలోని హిందుస్థాన్ పెట్రోలియం ఆయిల్ కంపెనీ భాకరాపేట రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో సీసీ కెమెరాల భద్రత, సెక్యూరిటీ ఏర్పాటు చేసుకోవాలని సిబ్బందిని ఆదేశించామన్నారు. అనుమానిత వ్యక్తులు ఎవరైనా కనపడితే సమాచారం ఇవ్వాలన్నారు.

నిత్యపూజకోనలో చెట్ల తొలగింపు

మండలంలోని వంతాటిపల్లె గ్రామం లంకమల్ల అభయారణ్యంలో వెలసిన నిత్యపూజ కోనలో దారికి అడ్డంగా ఉన్న చెట్ల తొలగించారు. నీటిగుండాల్లో ఉన్న అపరిశుభ్రత తొలగించారు. ఎండోమెంట్ ఇన్‌చార్జి ఈవో శ్రీధర్ ఆదేశాల మేరకు చర్యలు చేపట్టారు.

డీకేటీ భూమిని పరిశీలించిన తహసీల్దార్

మండలంలోని కడప - చెన్నై జాతీయ రహదారి కనుమలోపల్లె రెవెన్యూ డీకేటీ పొలం 20, 21 సర్వేనంబరులోని ఒక ఎకరా పొలంలో అనుమతులు లేకుండా టిప్పర్లతో చదును కోసం గ్రావెల్ తరలిస్తున్న విషయం తెలియడంతో ఇన్‌చా ర్జి తహసీల్దారు మాధవీలత పరిశీలించి పనులను నిలుపుదల చేశారు.

అనుమానితవ్యక్తుల సమాచారం తెలపండి:ఎస్ఐ

అనుమానిత వ్యక్తుల సమాచారం తెలపాలని ఎస్ఐ ఎస్ఐ మహ్మద్‌రఫీ కోరారు. శనివారం మాచుపల్లె గ్రామంలో నాకాబందీ నిర్వహించారు. ఒంటిమిట్ట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బాబు ఆధ్వర్యంలో శనివారం కాటన్ సెర్చ్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండలాల్లో అనుమానిత వ్యక్తులు ఎవరైనా కనపడితే సమాచారం తెలపాలన్నారు.

ఇరువర్గాల దాడి - కేసు నమోదు

రాజంపేట టౌన్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): రాజంపేట పట్టణంలో శనివారం ఇరువర్గాల వారు దాడికి దిగడంతో ఇరువురికి గాయాలయ్యాయి. పోలీసులు, బాధితుల వివరాల మేరకు.. పట్టణానికి చెందిన వెంకటరమణ, శివపై అదే ప్రాంతానికి చెందిన రెడ్డితేజ, వాసు, బాలాజీ తన అనుచరులతో శనివారం రాత్రి కట్టెలు, రాళ్లతో దాడి చేసి గాయపరిచారు. పట్టణంలోని శివాజీనగర్‌లో ఓ ఇంటి నిర్మాణ పనులు జరుగుతుండగా రెడ్డితేజ అనుచరుడు పైప్‌లైన్‌ను బైక్‌తో తొక్కించాడు. దీంతో ఆ ఇల్లు నిర్మించే బేల్దారి వెంకటరమణ అతన్ని నిలదీశాడు. వెంటనే రెడ్డితేజ తన అనుచరులతో వారిపై దాడిచేశారు. ఈ దాడిలో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. గాయపడిన వారిని రాజంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మండలంలో సమస్యలపై అధికారులు దృష్టి సారించాలి

చిట్వేలి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలో సమస్యలపై దృష్టి సారించాలని ఎంపీడీవో మోహన్ పేర్కొన్నారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో అన్నిశాఖల అధికారులు వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ శానిటేషన్ హౌసింగ్, ముఖ్యంగా తాగునీటిపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు.

సీతారాముల కల్యాణం సకల శుభాలకు సోపానం



ప్రసాద్‌బాబును సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

రాయచోటిటౌన్, ఏప్రిల్26(ఏప్రిల్): సీతారాముల కల్యాణం సకల శుభాలకు సోపానం అని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్ బాబు అన్నారు. శనివారం రాయచోటి పట్టణంలోని రామాపురంలో జరిగిన సీతారాముల కల్యాణ మహోత్సవం కార్యక్రమానికి శ్రీకోదండ రామాలయం కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు సుగవాసి ప్రసాద్‌బాబు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. టీడీపీ నాయకులు అంగడిసాయి, పెరికల రెడ్డెన్న, పురం రెడ్డెయ్య, ఆంజనేయులు, ఎర్ర శివ, చిట్టి శివ, శ్రీనివాసులు, లాయర్ సతీశ్‌రెడ్డి, బడిశెట్టి రవి, వాకా వాసు, రామాంజనేయులు పాల్గొన్నారు.

వీఆర్వో బెదిరింపులపై జేసీకి ఫిర్యాదు

● తహసీల్దారు పీర్‌మున్నీ

రాజంపేట టౌన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట మండలంలో ప్రభుత్వ భూములపై కూటమి నేతలు గతంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు అందజేశారు. వీటిపై వరుసగా ప్రచారమాధ్యమాల్లో కథనాలు వెలువడ్డాయి. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారికి రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేశారు. అది జీర్ణించుకోలేని ఆకేపాడు ప్రాంతానికి చెందిన చోటా నాయకుడు ఆ ప్రాంతానికి చెందిన వీఆర్వోకు ఫోన్‌చేసి దుర్భాషలాడినట్లు మా ప్రాంతానికి వచ్చి భూములను సర్వే చేస్తారా అంత ధైర్యం మీకుందా అని ప్రశ్నించినట్లు తెలిసింది. ఈ ప్రాంతంలో పనిచేయాలంటే చాలా ఇబ్బందిగా ఉందని, ఈ విషయాన్ని వీఆర్వో తహసీల్దారుకు విన్నవించినట్లు తెలిసింది. ఈ విషయాన్ని జేసీకి తెలిపినట్లు తహసీల్దారుపేర్కొన్నారు.

3న ఆలయ భూముల వేలం పాట

చిట్వేలి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : చిట్వేలిలో వెలసి ఉన్నశ్యామలాంబ సమేత సోమేశ్వరస్వామి, వరదరాజస్వామి, ఆంజనేయస్వామి ఆలయాల భూములను మే 3న బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు కార్యనిర్వహణ అధికారి జి.కొండారెడ్డి శనివారం తెలియజేశారు. రీజనల్ జాయింట్ కమిషనర్ మల్టీజోన్ 11న తిరుపతి వారి ఆదేశాల మేరకు వేలం ఉంటుందన్నారు.

వైభవంగా కాల గంగమ్మ తిరునాళ్లు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

ఒంటిమిట్ట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : ఒంటి మిట్ట చె రువు కట్టపై వెలసిన కాల గంగమ్మ తిరుణాల వైభవంగా నిర్వహించారు. శనివారం వేకువ జామునే అమ్మవారికి అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కడప, రాజంపేట, నందలూరు, సిద్దవటం నుంచి భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. నిర్వాహకులు సిగే భాస్కర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

కాటాలను సరి చూసుకోండి

సిద్దవటం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : అట్లూరు, సిద్దవటం మండలాలకు చెందిన కాటాలు వాడుతున్న వ్యాపారులు మీ కాటాలను సరి చూసుకోవాలని లీగల్ మెట్రాలజి ఇన్‌స్పెక్టర్ రమేష్‌కుమార్‌రెడ్డి అన్నారు. సిద్దవటం టూరిజం గెస్ట్‌హౌస్‌లో శనివారం కాటాలకు, తూనికల రాళ్లకు వ్యత్యాసాలను సరిచేసి ముద్రలు చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యాపారులు యేడాదికొకసారి వ్యత్యాసాలను తప్పనిసరిగా సరిచేసుకోవాలన్నారు.

ఫాసిజమే మానవాళికి శత్రువు

- యుద్ధం అంటే వినాశనమే
- స్నేహ సంబంధాలను పెంచుదాం.
- ఇస్కఫ్ 20 రాష్ట్ర మహాసభలో వక్తల పిలుపు





మహాసభల్లో మాట్లాడుతున్న జాతీయ ప్రధాన కార్యదర్శి బిజయ్ కుమార్ పదిహారి.. హాజరైన జనం

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ మానవాళికి ఫాసిజం ప్రధాన శత్రువు అని భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బిజయ్ కుమార్ పదిహారి అన్నారు. శనివారం స్థానిక గొల్లపల్లెలోని శేషసాయి కల్యాణ మండపంలో ఇస్కఫ్ 20వ రాష్ట్ర మహాసభ (ఇస్కఫ్)ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు టీఎస్ సుకుమారన్ అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా పహల్గామ్‌లో ఉగ్రవాద దాడిలో అసువులు బాసిన వారి ఆత్మశాంతికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం ఇస్కఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి బిజయ్ కుమార్ పదిహారి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా మానవాళి తీవ్ర సంక్షోభాల మధ్య జీవిస్తోందన్నారు. అధిపత్యం కోసం అగ్రరాజ్యాలు యుద్ధోన్మాదాన్ని పెంచుతున్నాయని తెలిపారు. పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడి విషయం గుర్తు చేశారు. భారతదేశంపై కూడా ఉగ్రదాడి జరిగిందని. ఉగ్రవాదులకు కూడా అగ్రరాజ్యాలే ఆయుధాలు అమ్ముతున్నాయన్నారు. యుద్ధం మానవాళి వినాశనానికి దారి తీస్తోందన్నారు. ఫాసిజం జడలు విప్పుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. అది మానవాళికి ప్రధాన శత్రువని అన్నారు. హిట్లర్ ఫాసిజానికి వ్యతిరేకంగా నిలబడిన నేతలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. రానున్న ఆగస్టు 30న ఫిడేల్ క్యాస్ట్రో జయంతిని దేశ వ్యాప్తంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం విదేశాల మధ్య సంబంధాలు బలహీన పడుతున్నాయని, ఈ క్రమంలో ప్రజల మధ్య స్నేహ సంబంధాలను పెంచడం ద్వారా మానవ సంబంధాలు బలపడుతాయని అన్నారు. ఇందు కోసం ఇస్కఫ్ దశాబ్దాలుగా పని చేస్తోందన్నారు. మరెంత చైతన్యవంతంగా పని చేద్దామని పిలుపునిచ్చారు. భారతదేశానికి అన్ని ప్రపంచ దేశాల ప్రజాలతో స్నేహ, శాంతి పూర్వక సంబంధాలు మెరుగు పర్చడం ఇస్కఫ్ ఆశయమని స్పష్టం చేశారు. చైన్నై నుంచి ప్రత్యేక అతిథిగా విచ్చేసిన డిప్యూటీ కౌన్సిల్ జనరల్ ఆఫ్ రష్యా సెర్జెయ్ అజారోస్ సందేశమిచ్చారు. ఆయన మాట్లాడుతూ రష్యా భారతదేశం మధ్య సహకార సంబంధాలకే చాలా విస్తారమైన అవకాశాలు ఉన్నాయని తెలిపారు. అన్ని రంగాల్లో అభివృద్ధి కోసం భారతదేశం కలిసి పని చేయాలన్నారు. రష్యా, భారతీయ సంబంధాల విషయంలో రష్యా అధ్యక్షుడు పుతిన్ అంచనాలు చాలా ఉన్నంతంగా ఉన్నాయన్నారు. భారత సమాజం అభివృద్ధికి సోవియట్ కాలం నుంచి ఇప్పటికీ రష్యా పూర్తి అండగా ఉందని తెలిపారు. ఇరుదేశాల ప్రజల మధ్య, ప్రభుత్వాల మధ్య సాంస్కృతిక, క్రీడలు, కళా సంబంధాలు బలంగా ఉన్నాయన్నారు. దీని ద్వారా భారతీయ నిపుణులు రష్యాలో శిక్షణ పొందారని గుర్తు చేశారు. విద్యకు సంబంధించి చాలా ఉన్నతమైన మేళవింపు ఉందన్నారు. భారత్ ఒక శక్తివంతమైన దేశంగా వెలుగొందాలని తాము అభిలషిస్తున్నామన్నారు. రెండు దేశాల భవిష్యత్ కోసం కలిసి పని చేయాలని పిలుపునిచ్చారు. ఇస్కఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాగితాల రాజశేఖర్ నివేదికను ప్రవేశ పెట్టారు. గత మూడేళ్ల ఇస్కఫ్ కృషిని వివరించారు. మతాన్ని, సంస్కృతిని కలుషితం చేసి ప్రజలను మభ్యపెట్టడానికి చూస్తున్న శక్తుల నిజ స్వరూపాన్ని చర్చకు పెట్టి సమాజానికి దిశానిర్దేశం చేయడం మనందరి కర్తవ్యం అన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, ఎస్కే యూనివర్సిటీ విశ్రాంత ఆచార్యులు వెంకటరెడ్డి, ఇస్కఫ్ ప్రధాన కార్యదర్శి ఎస్ నరసింహులు, తమిళనాడు ఇస్కఫ్ నేత సుధాకర్, తెలంగాణ ప్రతినిధి అరుణ, తుంగా శ్రీధర్, రామచంద్రయ్య, మాచిరెడ్డి, డాక్టర్ సంజీవయ్య, బి.కృష్ణ, ఇస్కఫ్ కోశాధికారి సత్యాంజనేయ, అనకాపల్లె నేత మాధవరావు, సీహెచ్ శ్రీదేవి, అరుణ్‌కుమార్, యువజన సమాఖ్య జాతీయ నేత లెనిన్‌బాబు, క్షేత్రపాల్‌రెడ్డి, వెంకటరావు, సీపీఐ నియోజకవర్గ నాయకుడు మురళి, వివిధ జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు.

పాకిస్థానీయులూ.. పదండి

- మదనపల్లెలో ఐదుగురు గుర్తింపు...
- పోలీసులు నోటీసులు జారీ

మదనపల్లె, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్ పౌరసత్వం కలిగి కొన్నేళ్లుగా ఇక్కడే నివాసం ఉంటున్న ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురిని పోలీసులు గుర్తించారు. పహల్గామ్ తీవ్రవాద దాడి నేపథ్యంలో అప్రమత్తమైన కేంద్రం వీసాలు ఆపేసి, ఇప్పటికే మనదేశంలో నివసిస్తున్న వారిని పాకిస్థాన్ పంపేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా పోలీసులు ఎక్కడికక్కడ జల్లెడ పడుతున్నారు.. ఈ క్రమంలో మదనపల్లెలో కొన్నేళ్లుగా నివాసం ఉన్న ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురిని శనివారం గుర్తించారు. ఎస్పీ ఆదేశాల మేరకు నోటీసులు జారీ చేసి దేశం విడిచి వెళ్లాని సూచించారు.

మదనపల్లె పట్టణంలోని కురవంకలో పాకిస్థాన్ పౌరసత్వం కలిగిన ఐదుగురు స్థిర నివాసం ఏర్పరుచుకున్నారు. శనివారం వారికి పోలీసులు నోటీసులు అందించి తక్షణం దేశం విడిచి వెళ్లాల్సిందిగా ఆదేశించారు. అయితే దీనికి సంబంధించి తదుపరి ఉత్తర్వులు ఏవీ రాకపోవడంతో ప్రస్తుతానికి వారు ఇక్కడే ఉన్నారు. స్థానిక ఆంజనేయస్వామి గుడి వీధికి చెందిన గులాబ్‌జాన్ కొన్నేళ్ల క్రితం సౌదీకి వెళ్లి అక్కడ పాకిస్తానీయుడైన బషీర్ అహ్మద్ భట్‌ను పెళ్లి చేసుకుంది. వీరికి ఐదుగురు సంతానం. వారికి పాకిస్థాన్ పౌరసత్వం ఉంది. తర్వాత పిల్లలను ఐదుగురిని తీసుకుని గులాబ్‌జాన్ మదనపల్లెకు చేరుకుంది. ఇక్కడ మరో కుమారుడు జన్మించాడు. అతడికి భారతదేశ పౌరసత్వం ఉంది. మదనపల్లెలో ఉంటున్న పాకిస్థాన్ పౌరసత్వం కలిగిన గులాబ్‌జాన్ ఐదుగురు సంతానం ఇక్కడే విద్యాభ్యాసం పూర్తి చేశారు. ఇండియాలో రెసిడెన్స్ వీసా పొంది రెన్యువల్ చేసుకుంటూ ఇక్కడే ఉంటున్నారు. వారిలో పెద్ద కూతురు షాజియా ఖాన్వాల్(35) బెంగళూరులో కేరళకు చెందిన వ్యక్తిని పెళ్లి చేసుకుంది. రెండవ సంతానం మహమ్మద్ యాసీన్ (32) మదనపల్లెలో పనిచేస్తూ ఇక్కడికి చెందిన అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడు. మూడవ సంతానమైన షమ్మా బషీర్ అహమ్మద్ వాల్మీకిపురంలో వివాహం చేసుకుంది. నాల్గో సంతానమైన యాస్ బషీర్, ఐదవ సంతానం ఫాతీమ బషీర్ ఇద్దరు అవివాహితులు. అయితే ఇప్పటికిప్పుడు దేశం విడిచి వెళ్లడానికి వాళ్లు నిరాకరించడంతో ఉన్నతాధికారులకు తెలియజేసి వారి ఆదేశాల కోసం పోలీసులు ఎదురుచూస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

- అడ్డుకున్న పోలీసులు

సిద్దవటం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): భార్య అనారోగ్యం కారణంగా మృతిచెందుతుందన్న బాధలో శనివారం ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన సిద్దవటం పోలీసులు అతన్ని కాపాడి మానవత్వాన్ని చాటుకున్నారు. ఆ వివరాల్లోకి వెళితే.. అట్లూరు క్రాస్ రోడ్డులో నివాసం అబ్బిరెడ్డి అనే వయోవృద్ధుడు తన భార్య ఆరోగ్యం గత కొన్నిరోజులుగా సరిగ్గా లేకపోవడంతో ఆమె మృతి చెందుతుందనే మనస్థాపంతో రైలు కింద పడి మృతి చెందాలని నిర్ణయించుకున్నాడు. ఈ మేరకు మండలంలోని కనుమలోపల్లి రైల్వేస్టేషన్ పరిధిలో ఆత్మహత్యాయత్నం చేసుకోబోతుండగా గమనించిన రైల్వే అధికారులు స్థానిక పోలీసుస్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు అక్కడకు చేరుకుని అబ్బిరెడ్డిని కాపాడి స్టేషన్‌కు తరలించారు. అనంతరం అతని బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ మహమ్మద్‌రఫీ తెలిపారు.

సీసీ కెమెరాలు చోరీ

కలకడ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కలకడ మండలంలోని ఆదర్శ పాఠశాల గేట్ వద్ద ఏర్పాటు చేసిన రెండు సీసీ కెమెరాలను గుర్తుతెలియని వ్యక్తులు గురువారం రాత్రి చోరీ చేశారు. ఇక్కడ పని చేస్తున్న వాచ్‌మన్ రామాంజులు రాత్రి భోజనానికి వెళ్లి తిరిగి వచ్చేలోపు ఈ చోరీ జరిగింది. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు అందింది.

రైలుకింద పడి మహిళ మృతి

పుల్లంపేట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దేవసముద్రం వడ్డిపల్లెకు చెందిన పసుపులేటి సీతమ్మ శనివారం ఉడుమువారిపల్లె సమీపాన రైలుకింద పడి మృతి చెందింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. సీతమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సంఘటనపై రేణిగుంట రైల్వేపోలీసు గౌరీశంకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బడి తాళాలు పగలగొట్టిన ఆకతాయిలు

- రిజిస్టర్ల చింపివేత
- కుర్చీలు, బెంచీలు విరగ్గొట్టి హల్‌చల్

సుండుపల్లె, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి సమీపంలోని దిగువగుల్లావాండ్లపల్లె ఎంపీపీ పాఠశాల తాళాలు పగలగొట్టి ఆకతాయిలు హల్‌చల్ చేశారు. ప్రహరీ దూకి వచ్చి బోర్డుపై పెయింట్‌తో లవ్ సింబల్స్ వేసి హంగామా చేసినట్లు ఆ పాఠశాల హెడ్మాస్టర్ కృష్ణవేణి శనివారం తెలిపారు. పాఠశాలలోని రికార్డు గదిలోకి వెళ్లి రిజిస్టర్లు చింపి కుర్చీలు, బెంచీలు విరగ్గొట్టారన్నారు. సీసీ కెమెరాల ఆధారంగా వారిని గుర్తించి కేసు నమోదు చేయాలని ఆమె కోరారు. ప్రభుత్వ బడి తాళాలు పగులగొట్టడం నేరంగా పరిగణించి అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.



బీరువా తాళాలు పగలగొట్టిన దృశ్యం

ప్రభుత్వ పథకాల్లో లక్ష్యాలను సాధించాలి

- గ్రామాల్లో ఎక్కడా తాగునీటికి ఇబ్బంది రాకూడదు
- కలెక్టర్ చామకూరి శ్రీధర్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి(కలెక్టరేట్), ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి): ప్రజల సంక్షేమ, ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పథకాల్లో వందశాతం లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేట్ మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి రెవెన్యూ, సామాజిక పింఛన్లు, తాగునీరు, జీఎస్‌డబ్ల్యూఎస్, గృహ నిర్మాణం, డ్వామా, పంచాయతీరాజ్, పారిశుధ్య తదితర అంశాలపై మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పౌరులకు మెరుగైన రెవెన్యూ సేవలను అందించాలన్నారు. ఇంటి నిర్మాణం కోసం పొజిషన్ సర్టిఫికెట్ల జారీలో వెనుకబడిన మండలాల తహసీల్దార్లతో ఆర్డీవో, సబ్ కలెక్టర్ స్వయంగా సమీక్షించి ఒక వారంలోగా పెండింగ్ పూర్తి చేయాలన్నారు. ప్రతి మండలంలో ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు ఫీజిబులిటీ నివేదికను వెంటనే పంపాలని సూచించారు. జిల్లాలో పచ్చి మేత పెంపకానికి డివిజన్, మండల స్థాయిలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ డీకేటీ, ప్రైవేట్ భూములను ప్రతి మండలంలో కనీసం 3 వేల ఎకరాలను గుర్తించాలన్నారు. ఇందుకు ప్రభుత్వం జారీ చేసిన నూతన మార్గదర్శకాలను దృష్టిలో ఉంచుకోవాలి. జిల్లాలో 2023 డిసెంబరు నుండి 2024 అక్టోరు 31 మధ్యలో మృతి చెందిన వారి భార్యలకు ప్రభుత్వం నూతనంగా లక్ష పింఛన్లను మంజూరు చేయగా, ఇందులో మన జిల్లాకు 3316 వితంతు పింఛన్లను మంజూరు చేసిందన్నారు. ఇప్పటికే అర్హత కలిగిన దరఖాస్తులకు సంబంధించిన డెత్ సర్టిఫికెట్లను రేపు సాయంత్రంలోగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. అనంతరం జేసీ ఆదర్శ్ రాజేంద్రన్ మాట్లాడుతూ గృహ నిర్మాణానికి సంబంధించి పొజిషన్ సర్టిఫికెట్ల జారీలో ఇంకనూ జిల్లాలో 14శాతం పెండింగ్ ఉందని, ప్రగతిలో వెనుకబడిన మండలాలు లక్ష్యాలను తప్పనిసరిగా అధిగమించాలని తహసీల్దార్లకు సూచించారు. సమావేశంలో డీఆర్‌వో మధుసూదన్‌రావు, సబ్ కలెక్టర్లు మేఘస్వరూప్, నదియాదేవి, ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్రికెట్ అంపైర్లు, స్కోరర్ల కోసం దరఖాస్తుల ఆహ్వానం

వాల్మీకిపురం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ (సీడీసీఏ) నుంచి అంపైర్లు, స్కోరర్ల కోసం ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయకుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామస్థాయి నుంచి క్రికెట్ అభివృద్ధి చేయడంలో భాగంగా ఈ అవకాశం కల్పిస్తున్నామన్నారు. ఇటీవల విజయవాడలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఎంపీ, ఏసీఏ జిల్లా అధ్యక్షుడు కేసినేని శివనాథ్ (చిన్ని) గ్రామీణ స్థాయిలో క్రికెట్ అభివృద్ధి చేయడంతో పాటు క్రికెటర్లకు ఉపాధి కల్పించనున్నట్లు చెప్పారన్నారు. ఇందులో భాగంగా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విజయకుమార్ తెలియజేశారు. ఆసక్తి గల అభ్యర్థులు కనీసం పదో తరగతి పాసై ఉండాలని, 18 ఏళ్ల నుంచి 40 ఏళ్లలోపు వయసు వారు అర్హులన్నారు. క్రికెట్‌పై మౌలిక అవగాహన ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని, ఆసక్తి గలవారు సీడీసీఏ రూపొందించిన గూగుల్ ఫారంలో సంప్రదించాలన్నారు. ఈనెల 30లోపు దరఖాస్తు చేసుకోవాలని ఇతర వివరాలకు సెల్‌ఫోన్ నెంబర్లు 8886185559, 9000214966లను సంప్రదించాలన్నారు.

హాకీ శిక్షణను సద్వినియోగం చేసుకోండి



మదనపల్లె టౌన్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): జిల్లా శాప్, సెట్విన్ ఆధ్వర్యంలో మదనపల్లెలో నిర్వహించనున్న హాకీ ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. మదనపల్లె బీటీ కళాశాల మైదానంలో ఈ నెల 28 నుంచి 30 వరకు మూడు రోజుల పాటు నిర్వహించే ఈ శిక్షణలో 8 నుంచి 18 ఏళ్లలోపు క్రీడాకారులకు కోచ్ నౌషాద్, సీనియర్ హాకీ క్రీడాకారులు శిక్షణ ఇస్తారన్నారు. వివరాలకు 94923 77889 నెంబర్‌కు ఫోన్ చేయాలని డీఎస్‌వో కోరారు.

పెంచలకోనకు ప్రత్యేక బస్సు సర్వీసు

రాజంపేట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనకు రాజంపేట డిపో నుంచి ప్రత్యేక బస్సు సర్వీసు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ ఎం.రమణయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బస్సు ఉదయం 5.15 గంటలకు రాజంపేటలో బయలుదేరి 6.30 గంటలకు కడప బస్టాండ్‌కు చేరుతుందన్నారు. అనంతరం కడప నుంచి 6.40 గంటలకు పెంచలకోనకు బయలుదేరుతుందన్నారు. చిట్వేలి, రాపూరు మీదుగా ఉదయం 10.45 గంటలకు పెంచలకోనకు చేరుతుందని పేర్కొన్నారు. తిరిగి 11.15 గంటలకు పెంచలకోనలో బయలుదేరి ఇదే మార్గంలో మధ్యాహ్నం 1.45 గంటలకు రాజంపేటకు చేరుకుంటుందని తెలిపారు. తిరిగి 2.15 గంటలకు రాజంపేటలో బయలుదేరి రాపూరుకు 3.45 గంటలకు చేరుకుంటుందని వివరించారు. 4 గంటలకు రాపూరులో బయలుదేరి చిట్వేలి, రాజంపేట మీదుగా కడపకు రాత్రి 7 గంటలకు చేరుకుంటుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



ఆర్టీసీ బస్సు - బొలెరో వాహనం ఢీ

- ఒకరు మృతి.. 14 మందికి గాయాలు



మృతి చెందిన రామాంజుల్‌రెడ్డి

రామాపురం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కర్నూలు-చిత్తూరు 40వ జాతీయ రహదారి రామాపురం మండలం హసనాపురం పంచాయతీ టోల్‌గేట్ సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా 14 మందికి గాయాలయ్యాయి. ఆర్టీసీ బస్సు నిలబడి ఉన్న బొలెరో వాహనాన్ని ఢీకొనడంతో రామాంజుల్‌రెడ్డి(80) అనే వ్యక్తి మృతి చెందగా రమాదేవి, జగదీశ్‌బాబు, గీతావాణి, సుమిత్ర, ఆస్మా, రెడ్డిరాణి, విజయ్‌కుమార్‌రెడ్డి, మాన్యత, మహేశ్, రాణమ్మ, చౌడయ్య, జమున, డ్రైవర్ ప్రసాద్‌రెడ్డి, కండక్టర్ నరసింహులుకు గాయాలయ్యాయి. వీరిలో రామాంజుల్‌రెడ్డి, రమాదేవి, జగదీశ్‌బాబు, గీతావాణి, సుమిత్ర వంగిమళ్లకు చెందిన వారు. వీరంతా ఒకే కుటుంబానికి చెందిన వారు. మిగిలిన వారు ఇతర ప్రాంతాలకు చెందినవారు. ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డి కథనం మేరకు.. రాయచోటి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వంగిమళ్ల నుంచి రాయచోటికి వస్తుండగా టోల్‌గేట్ సమీపంలోకి రాగానే బొలెరో వాహనం పంక్చర్ అయింది. దీంతో బొలెరో వాహనానికి టైరు మార్చుతుండగా వెనుకవైపు నుంచి ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. రామాపురం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రామాంజుల్‌రెడ్డి చికిత్స పొందుతూ మృతి చెందారు. రమాదేవి, జగదీశ్‌బాబు, గీతావాణి పరిస్థితి విషమించడంలో కడప రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రెవెన్యూ పెట్రోలు పంపు ఏర్పాటుకు స్థల పరిశీలన



ఐవోసీ ప్రతినిధులతో పీలేరు తహసీల్దారు భీమేశ్వర రావు

పీలేరు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో పీలేరులో పెట్రోలు పంపు ఏర్పాటు కానుంది. ఇందుకు సంబంధించి పీలేరు రెవెన్యూ అధికారులు, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ అధికారులు శనివారం స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా పీలేరు తహసీల్దారు భీమేశ్వరరావు మాట్లాడుతూ రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో పెట్రోలు పంపు ఏర్పాటుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోందని, అందుకు అనువైన స్థలం ఎంపిక చేయాల్సిం దిగా తమకు ఆదేశాలు అందాయన్నారు. దీంతో గూడరేవుపల్లె పంచాయతీ సర్వే నెం.198లో కొత్తగా నిర్మితమవుతున్న నేషనల్ హైవేకు ఆనుకుని 0.75 ఎకరాల భూమి సేకరించామన్నారు. ఆ స్థలాన్ని శనివారం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ చెన్నై శాఖ జనరల్ మేనేజర్ శ్రీనివాసులు, మేనేజర్ రాజ్ కుమార్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. వారు తమ నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తారన్నారు. ఇప్పటికే జైళ్ల శాఖ, ఏపీఎస్ఆర్టీసీ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని పలుచోట్ల పెట్రోలు పంపులు నడుస్తుండగా రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలోనూ ఏర్పాటు కానుండడం విశేషం.

ఉత్కంఠభరితంగా బండలాగుడు పోటీలు



ఒంటిమిట్ట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ఒంటిమిట్ట చెరువు కట్టపై వెలసిన కాల గంగమ్మ తిరునాళ్ల సందర్భంగా నిర్వహించిన బండలాగుడు పోటీలు ఉత్కంఠభరితంగా సాగాయి. భక్తులు, ప్రజల కేరింతల మధ్య బండలాగుడు పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీలను రాష్ట్ర మాజీ డైరెక్టర్ ఆకేపాటి వేణుగోపాల్ రెడ్డి ప్రారంభించారు. గెలుపొందిన ఎడ్ల యజమానుల కు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సుబ్బారెడ్డి, శేషారెడ్డి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

రైల్వేకోడూరు జాతరకు వందేళ్లు

- 30 నుంచి మొదలు
- భారీ ఏర్పాట్లు.. పోలీసు బందోబస్తు
- దొంగలను పట్టుకునేందుకు డ్రోన్ కెమెరాతో నిఘా



బలిజవీధిలో వెలసిన గంగమ్మ తల్లి

రైల్వేకోడూరు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రమైన రైల్వేకోడూరు బలిజవీధిలో నిర్వహించే జాతరకు వందేళ్లు నిండాయి. మొదట జాతర ఉత్సవాలను సుగవాసి కుటుంబం మొదలు పెట్టింది. తర్వాత యెలిశెట్టి, ఆ తర్వాత పంద్రా కుటుంబీకులు చేస్తున్నారు. 1925లో జాతరను ప్రారంభించారు. ఈ ఏడాదికి వందేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా జాతర ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ జాతరకు ఒక కమిటీ ఉంది. గంగమ్మతల్లి పేర బలిజవీధిలో సుమారు రూ.80 లక్షలు పెట్టి స్థలాన్ని కొనుగోలు చేసి, ఆ స్థలంలో ఓ దాత కల్యాణ మండపాన్ని నిర్మించారు.

30 నుంచి జాతర

బలిజవీధిలో వెలసిన గంగమ్మ జాతర ఈనెల 30వ తేదీ నుంచి మొదలై మూడురోజుల పాటు జరుగు తుందని నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు ప్రతి వీధిలో విద్యుత్ దీపాలంకరణలు, గంగమ్మ ప్రతిమల తో కూడిన విద్యుత్ బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. 30వ తేదీ నుంచి వేషాలు, విజయవాడ తప్పెట్లు తదితర కార్యక్రమాలతో జాతర ఉత్సవాలు ప్రారంభమవుతాయి. అదేరోజు అర్ధరాత్రి పల్లకీ ఉత్సవం, అ నంతరం అంకాళమ్మ దేవస్థానంలో అమ్మవారి ప్రతి మను బంకమన్నుతో తయారు చేసి వెండి, బంగారు వస్తువులతో అలంకరించి అక్కడి నుంచి మండపం వరకు తీసుకువస్తారు. అమ్మవారు వెళుతుండగా భక్తులు మొక్కులు తీర్చుకుంటారు. మండపం వద్ద వేపమండలతో గుడిని ఏర్పాటు చేసి గంగమ్మతల్లిని నిలబెడతారు. ఆ రోజంతా భక్తులకు దర్శనం కల్పిస్తారు. మే 2వ తేదీ ఉదయాన్నే ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని నిమజ్జనానికి తీసుకెళతారు. దీంతో జాతర ముగుస్తుంది. ఈ జాతరకు తిరుపతి, కడప, వెంకటగిరి, రాజంపేట, నెల్లూరు, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుండి భక్తులు వస్తారు.

జాతరకు పటిష్ఠ బందోబస్తు..



రైల్వేకోడూరులో నిర్వహించే జాతరను ఎలాంటి సమస్యలు లేకుండా పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం. జాతరలో డ్రోన్ నిఘా పెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం. దొంగలను పట్టుకోవడానికి బందోబస్తును ఏర్పాటు చేస్తున్నాం. ఈ మేరకు జాతర నిర్వాహకులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చాం.

- మనోజ్‌రామనాథ్‌హెగ్డే, రాజంపేట ఏఎస్పీ





చలువపందిళ్లు

10 నుంచి దేవుని కడప శ్రీవారి తెప్పోత్సవాలు

కడప కల్చరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): తిరుమల తొలిగడప దేవుని కడప శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారి తెప్పోత్సవాలు మే 10వ తేదీ నుంచి 12వ తేదీ వరకు జరుగనున్నాయి. ఈసందర్భంగా స్వామి, అమ్మవార్లు ఆలయ పుష్కరిణిలో ప్రతి రోజూ సాయంత్రం 6 గంటలకు తెప్ప లపై విహరించి భక్తులను కటాక్షిం చనున్నారు. అందులో భాగంగా మే 10న శ్రీకృష్ణ సమేత గోదాదేవి మూడు చుట్లు, 11న శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఐదు చుట్లు, 12న శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీ వేంకటేశ్వరస్వామి వారు ఏడు చుట్లూ తెప్పలపై తిరిగి భక్తులకు కనువిందు చేయను న్నారు. కాగా ఆ మూడు రోజులలో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు స్నపన తిరుమంజనం, సాయంత్రం 5-30 నుంచి 6 గంటల వరకు తిరువీధి ఉత్సవం నిర్వహించనున్నారు.

అలాగే ఆలయంలో హిందూ ధర్మ ప్రచార పరిషత్, దాస సాహిత్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగనున్నాయి. భక్తులు తెప్పోత్సవాలను తిలకించి స్వామివారి సేవలో తరించాలని ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్ రెడ్డి కోరారు.

ప్రమాదాల దారి.. నాలుగు రోడ్ల రహదారి

- 15 నెలల్లో 18 మంది మృతి
- వాహనచోదకుల నిర్లక్ష్యంతో ప్రమాదాలు
- వీధిన పడుతున్న కుటుంబాలు


క్రీస్తురాజపురం వద్ద ప్రమాదకరంగా మారిన రోడ్లు కలిపే జంక్షన్

దువ్వూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): చిన్నపాటి నిర్లక్ష్యం నిండుప్రాణాలకు ముప్పు తెస్తోంది. అతి వేగం, రోడ్డు నిబంధనలు పాటించకపోవడంతో జాతీయ రహదారిపై తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో ఎంతో మంది మృత్యువాత పడుతుండగా.. వారి కుటుంబీకులు దిక్కులేని వారవుతున్నారు. మరికొందరు క్షతగాత్రులు అవిటివారుగా మిగిలిపోతున్నారు.

దువ్వూరు మండల పరిధిలోని నాలుగు రోడ్ల రహదారి రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. అధికారులు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా ప్రమాదాలకు అడ్డుకట్ట పడటంలేదు. ఇక్కడ తరచూ వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. ఈ పరిస్థితి ఇడమడక, కానగూడూరు, జిల్లేళ్ల, దువ్వూరు బైపాస్, క్రీస్తురాజపురం, గుడిపాడు, చింతకుంట సమీపంలో నెలకొంది. బైపాస్ రోడ్డుపైకి గ్రామాల్లో నుంచి వచ్చే వాహనదారులు అజాగ్రత్తగా వాహనాలు నడపడమే ఇందుకు కారణమని తెలుస్తోంది.

15 నెలల్లో 18 మంది మృతి

దువ్వూరు మండల పరిధిలో 2024 జనవరి నుండి ఈయేడు మార్చి వరకు జరిగిన రోడ్డు ప్రమాదాలను గమనిస్తే 18 మంది మృత్యువాతన పడ్డారు. మరో 20 మంది గాయపడిన వారిలో ఉన్నారు. వారిలో కొందరు అవిటివారిగా జీవనం కొనసాగిస్తున్నారు.

ప్రమాదాలకు ఇవే కారణాలు

- ప్రైవేటు ట్రావెల్స్ అతివేగంగా వెళుతూ అదుపు తప్పి బోల్తాపడుతున్నాయి.
- కొన్ని చోట్ల సూచిక బోర్డులు సరిగా లేకపోవడం, వాహనదారులకు ఇబ్బంది కలిగిస్తోంది.
- డ్రైవర్లు వాహనాలు నడిపే సమయంలో సెల్‌ఫోన్లలో మాట్లాడడం ప్రమాదాలకు కారణమవుతోంది.
- ఎక్కువగా యువత మద్యం సేవించి బైకులు నడపడం మరో కారణం.
- ఆటోలలో పరిమితికి మించి జనాలను ఎక్కించుకుని వెళ్లడం.
- నాలుగు రోడ్ల రహదారి ఎక్కే సమయంలో అజాగ్రత్తగా వాహనాలు నడపడం.
- లైసెన్సులు లేకుండా బైకులు నడపడం, హెల్మెట్లు ధరించకపోవడం లాంటి కారణాలు రోడ్డు ప్రమాదాలకు కారణం అవుతున్నాయి.

మార్కెట్ యార్డులో మౌలిక వసతుల కల్పనకు చర్యలు : జేడీ


మాట్లాడుతున్న మార్కెటింగ్‌శాఖ జేడీ రామాంజనేయులు

కడప రూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కడప పసుపు మార్కెట్ యా ర్డులో మౌలిక వసతుల కల్పనకు వీలైనంత త్వరలో తగు చర్యలు తీసుకుంటామని మార్కెటింగ్‌శాఖ జాయింట్ డైరక్టర్ రామాంజనేయులు పేర్కొన్నారు. శనివారం మార్కెట్ యార్డులో పసుపు కొనుగోలు, కమిషన్ ఏజెంట్లతో సమావేశమై సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా పలువురు కమిషన్ ఏజెంట్లు మార్కెట్ యార్డులో మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యం, వీధి దీపాలను ఏర్పాటు చేయాలని కోరారు. ఇందుకు జేడీ రామాంజనేయులు సానుకూలంగా స్పందించారు. రెండు, మూడు రోజుల్లో తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో మార్కెట్‌యార్డు కార్యదర్శి సుజాత, సూపర్‌వైజర్ గంగన్న, మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, కోశాధికారి గుర్రంకొండ మహేష్, సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ శిల్పకళా దినోత్సవం


శిల్పకళా ప్రదర్శనలో విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ శిల్పకళా దినోత్సవం సందర్భంగా డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ, స్కల్ప్చర్ విభాగం విద్యార్థుల కళా ప్రదర్శనను ఘనంగా నిర్వహించారు. శనివారం విద్యార్థుల శిల్పకళా ప్రతిభను ఉద్ఘాటిస్తూ, కళాకృతుల ప్రదర్శనను నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ ప్రొఫెసర్ జి. విశ్వనాథ్ కుమార్, విద్యార్థుల శిల్ప ప్రదర్శనను అభినందిస్తూ ఈ వేడుక ద్వారా విశ్వవిద్యాలయం సృజనాత్మకతను ప్రోత్సహించడంలో, భవిష్యత్ కళాకారులను ప్రేరేపించడంలో, శిల్పకళా రంగానికి మద్దతు ఇవ్వడంలో తన నిబద్ధతను మరోసారి నిరూపించుకుందన్నారు. ప్రదర్శనకు ఏర్పాట్లు చేసిన శిల్పకళ విభాగ అధ్యాపకులను, విద్యార్థులను వీసీ అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి


సుభాష్‌చంద్రబోస్ మృతదేహం

చాపాడు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు-మైదుకూరు జాతీయ రహదారిలోని మండల కేంద్రం చాపాడు వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సీబీఐటీ కళాశాల విద్యార్థి కామనూరు సుభాస్ చంద్రబోస్ (18) మృతి చెందా డు. పోలీసుల వివరాల మేర కు... దువ్వూరు మండలంలోని కృష్ణంపల్లె గ్రామానికి చెందిన సుబాస్ చంద్రబోస్ సీబీఐటీ కాలేజీలో డిప్లమా మొదటి సంవత్సరం చదువుతున్నాడు. చియ్యపాడు గ్రామంలో అతని బంధువుల ఇంటిలో ఉండి చదువుకుంటున్నాడు. శనివారం ఉదయం 8.30 గంటల సమయంలో పరీక్ష రాసేందుకు సీబీఐటీ కాలేజీకిమోటారు సైకిల్‌పై వెళుతుండగా ఎదురుగా గేదె రావడంతో దాన్ని ఢీకొని కిందపడ్డాడు. దీంతో అతని తలకు బలమైన గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 వాహనంలో ప్రొద్దుటూరులోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మోటారు సైకిల్‌పై వెనుకవైపు కూర్చొని ఉన్న అతని స్నేహితుడు శృతికుమార్ కూడా గాయపడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి..


భాస్కర్‌రెడ్డి మృతదేహం

పులివెందుల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పట్టణంలోని నారా యణ కళాశాల సమీపంలో నివాసముంటున్న రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి భాస్కర్‌రెడ్డి (55) అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. శనివారం ఉదయం ఈ ఘటన బయట పడింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా.. భాస్కర్‌రెడ్డి నారాయణ కళాశాల సమీపంలోని ఓ ఇంట్లో నివాసముంటున్నారు. అతని భార్య, కుమారుడు మరొకచోట ఉంటు న్నా రు. వీళ్లకు కుటుంబ కలహాలు ఉన్నాయి. కాగా, భాస్కర్‌రెడ్డి కొంతకా లంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఏం జరిగిందో ఏమో కానీ శనివారం ఉదయం ఆయన నిద్రలేవకపోవడంతో చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించగా అప్పటికే మృతి చెందాడు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ మురళీనాయక్ వెల్లడించారు.

లారీ, కారు ఢీ... వార్డు కౌన్సిలర్ మృతి


మృతి చెందిన షేక్ ఖాదర్‌బాషా (ఫైల్)

బ్రహ్మంగారిమఠం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేకలకుంట పంచాయతీ జెడ్.కొత్తపల్లె గ్రామ సమీపాన జాతీయ రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మైదుకూరు మున్సిపాలిటీ ఐదో వార్డు కౌన్సిలరు షేక్ ఖాదర్‌బాషా మృతి చెందాడు. బి.మఠం ఎస్ఐ చంద్రశేఖర్ వివరాల మేరకు... మైదుకూరు మండలం నుంచి ఖాదర్ బాషా కారులో బద్వేలుకు వెళుతున్నాడు. అదే సమయంలో బద్వేలు నుంచి మైదుకూరు వైపు వస్తున్న బొగ్గులారీ ఢీకొంది. దీంతో ఖాదర్‌బాషా అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కాగా, ఖాదర్‌బాషా మృతి పట్ల ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ ఫోన్ ద్వారా సంతాపం తెలిపి.. వారి కుటుంబ సభ్యులకు ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. పలువురు టీడీపీ నేతలు ఖాదర్‌బాషా మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళిలర్పించారు.

బ్రహ్మంసాగర్‌లో పడి వ్యక్తి మృతి


వీరబ్రహ్మం మృతదేహం

బ్రహ్మంగారిమఠం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మంసాగర్ ప్రాజెక్టులో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న ఎస్ఐ చంద్రశేఖర్ సిబ్బందితో కలసి సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటికి తీశారు. అతని వద్ద ఉన్న ఆధారాలను పరిశీలించి విజయవాడలోని మైలవరం మండలానికి చెందిన వీరబ్రహ్మం (40)గా గుర్తించామన్నారు. ఈ విషయం వారి బంధువులకు తెలిపామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బద్వేలుకు తరలించామని.. బంధువులు వచ్చిన వెంటనే ఫిర్యాదు స్వీకరించి కేసు నమోదు చేస్తామని తెలిపారు.

డబ్బుల కోసం బెదిరింపు.. కేసు నమోదు

మైదుకూరు రూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): డబ్బులు ఇవ్వకుంటే చంపుతానని బెదిరించి, చంపే ప్రయత్నం చేశారని రైస్ మిల్లు యజమాని సూరిశెట్టి ప్రసాద్ గుప్తా శనివారం మైదుకూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసుల సమాచారం మేరకు సూరిశెట్టి ప్రసాద్ రైస్ మిల్లు యజమాని. అతన్ని రేషన్ బియ్యం కొనుగోలు చేసి వాటిని పాలీస్ పట్టించి అక్రమవ్యాపారం చేస్తున్నావని చొక్కం ఆంజనేయులు అనే వ్యక్తి బెదించి డబ్బులు డిమాండ్ చేశాడు. బియ్యం టెస్ట్ చేసే ఇనుప కమ్మితో చంపడానికి బెదించాడని సూరిశెట్టి ప్రసాద్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి ఆంజనేయులును అరెస్టు చేసి కమలాపురం సబ్ జైలుకు రిమాండ్‌కు పంపినట్లు పోలీసులు తెలిపారు.

పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

- డీఎఫ్‌వో వినీత్‌కుమార్


డాక్టర్ కె.డి. వరప్రసాద్‌రావు డాక్టర్ ఎస్ లావణ్య లక్షిలకు జ్ఞాపికలను అందజేసి సత్కరిస్తున్న డీఎఫ్‌వో వినీత్‌కుమార్, జేడీ శారదమ్మ తదితరులు

కడప రూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పశువులు, జంతువుల ఆరోగ్యం సంక్షేమంపై పశువైద్యాధికారులు, శాస్త్రవేత్తలు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా అటవీశాఖ అధికారి వినీత్‌కుమార్ పేర్కొన్నారు. కడప నగరం కోటిరెడ్డి సర్కిల్‌లోని జిల్లా పశువైద్యశాఖ కార్యాలయంలో ప్రపంచ పశు వైద్య దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జంతు ఆరోగ్యంతో పాటు వాటి పరిరక్షణ, సంక్షేమం కొరకు అంకిత భావంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. జంతువుల జీవన ప్రమాణాలను మెరుగు పరచాలన్నారు. వన్యప్రాణుల సంరక్షణలో కూడా పశువైద్యులు పాత్ర ముఖ్యమన్నారు. వారి సేవలు గొప్పవని ప్రశంశించారు. పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి శారదమ్మ మాట్లాడుతూ పశువైద్య విశిష్టతను చాటి చెప్పేందుకు పశువైద్య దినోత్సవాన్ని నిర్వహించడం జరుగుతోందన్నారు. పశువైద్యశాఖలో పనిచేసే ప్రతి ఒక్కరు జంతువుల నుంచి మానవులకు వ్యాపించే వ్యాధులను నివారించి, నియంత్రిస్తున్నామన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వస్తున్న కెక్నాలజీ సమాచారాన్ని పశుపోషకులకు ఎప్పటికప్పుడు అందజేస్తున్నామన్నారు. జంతు సంబంధిత ఆహార ఉత్పత్తుల భద్రత కు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. జంతువుల ఆరోగ్యం, సంక్షేమం, ఉత్పాదకతను మెరుగు పరచడానికి పరిశోధనలు నిర్వహిస్తోందన్నారు. అనంతరం మెరుగైన పశువైద్య సేవలను అందించిన. సీనియర్ వెటరనరీ వైద్యు లు డాక్టర్ కేడీ వరప్రసాద్‌రావు, డాక్టర్ ఎస్.లావణ్య లక్షిలకు జ్ఞాపికలను అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కడప, పులివెందుల తదితర విపిసి డిప్యూటీ డైరక్టర్లు రమణయ్య, మంగేశ్, రంగస్వామి, రాజశేఖర్, ఏడిలు ఉమా, వెంకటసుబ్బయ్య, శివరామిరెడ్డి, శ్రీదర్‌లింగారెడ్డి, మారుతీతో పాటు, డాక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కల్లూరుపల్లెను గ్రీన్ విలేజ్‌గా చేస్తాం..

- అసిస్టెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వినోద్‌కుమార్


కల్లూరుపల్లె తాండాలో ప్రజలతో మాట్లాడుతున్న వినోద్‌కుమార్

చక్రాయపేట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కల్లూరుపల్లె తాండాను గ్రీన్ విలేజ్-ఐడీ ఫ్రీగా ప్రకటించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అసిస్టెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వినోద్‌కుమార్ అన్నారు. శనివారం మం డలంలోని కల్లూరుపల్లె తాండాలో కార్డన్ అండ్ సెర్చ్ కార్య క్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ అక్రమంగా తయారు చేసే మద్యం, డ్యూటీ చెల్లించని మద్యం, గంజాయి, ఇతర మత్తు పదార్థాలను గుర్తించడం, అనుమానితుల ఇళ్లు, పాత నిందితుల ఇళ్లు సమగ్రంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ నవో దయం 2.0 కార్యక్రమం కింద ఈ ఆపరేషన్ చేపట్టా మన్నారు. ఇప్పటికే ప్రత్యామ్నయ జీవనోపాధి కింద కొందరిని గుర్తించి ప్రభుత్వం తరపున లోన్లు ఇప్పించే ప్రతి పాదనలు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పులివెందుల ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ చెన్నారెడ్డి, చక్రాయపేట ఎస్ఐ కృష్ణయ్య, ఆర్కేవ్యాలీ ఇన్‌స్పెక్టర్ ఉలసయ్య, ముద్దనూరు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ విన్నీలత, ఈఎస్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథ్‌రెడ్డి, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ నీలకంఠేశ్వరరెడ్డి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పహల్గాం మారణకాండను నిరసిస్తూ జర్నలిస్టుల శాంతి ర్యాలీ



క్యాండిల్ ర్యాలీలో ఏపీయూడబ్ల్యూజే ప్రతినిధులు

కడప ఎర్రముక్కపల్లె, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): జమ్మూ-కాశ్మీర్ పహ ల్గాం మతోన్మాద మారణకాండను నిర సిస్తూ ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. శనివారం సాయంత్రం ఏపీయుడబ్ల్యూజే, ఏపీ ఎలక్ట్రానిక్ మీడి యా, వీడియో గ్రాఫర్, ఫొటో గ్రాఫర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో కోటిరెడ్డి సర్కిల్ నుంచి ఎర్రముక్క పల్లె సర్కిల్ అమరవీరుల స్థూపం వరకు ప్రదర్శన నిర్వహించారు. పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని వ్యతి రేకిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఉగ్రదాడిలో మరణించిన వారికి నివాళులు అర్పించారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ ఉగ్రదాడిని పిరికిపంద చర్యగా అభివర్ణించారు. టెర్రరిజం నిర్మూలనకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. మతంపేరుతో మారణహోమం సృష్టించిన పాకిస్థాన్ తీవ్రవాదులకు ఎలా బుద్ధి చెప్పాలో భారతదేశ ప్రభుత్వానికి, ప్రజలకు తెలుసన్నారు. కార్యక్రమంలో ఏపీ యూడబ్ల్యూజే జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలకృష్ణారెడ్డి, శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీను, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు రమ ణారెడ్డి, గౌరవాధ్యక్షుడు శ్రీనాథ్, ఆంధ్రజ్యోతి బ్యూరో ఎక్కంటి ఆంజనేయులు, ఏబీఎన్ కరస్పాండెంట్ శ్రీనివాసులు, కెమె రామెన్ సంఘం నాయకులు శ్రీనివాసులు, పెద్ద సంఖ్యలో మీడియా ప్రతి నిధులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


మేఘనాథ్‌రెడ్డి మృతదేహం

లింగాల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): సింహాద్రిపురం మండలం బిదినంచెర్ల గ్రామానికి చెందిన నల్లపు రెడ్డి మేఘనాథ్‌రెడ్డి శనివారం ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురి కావడంతో మృతి చెందాడు. ఎస్ఐ మధుసూదన్‌రావు కథనం మేరకు వివరాలిలా.. మేఘనాథరెడ్డికి లింగాల మండలం వెలిదండ్ల గ్రామ పొలంలో చీనీ తోట ఉంది. తోటకు నీరందించడానికి మధ్యాహ్నా సమయంలో ఇంటి వద్ద నుంచి వెళ్లి స్టార్టర్‌ను ఆన్‌చేసే క్రమంలో విద్యుదా ఘా తానికి గురయ్యాడు. భర్త ఎంత సేపటికి ఇంటికి రాకపోవడంతో మేఘ నాథ్‌రెడ్డి భార్య లక్ష్మి తోట వద్దకు వెళ్లి చూడగా అప్పటికే మృతి చెందాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.



మదనపల్లె: కాగడాల ర్యాలీలో పాల్గొన్న జనసేన, బీజేపీ నాయకులు, ప్రజాప్రతినిధులు



బికొత్తకోట: గట్టులో కొవ్వొత్తులతో ర్యాలీ చేస్తున్న స్థానికులు



కురబలకోటలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు



వాల్మీకిపురం: ఉగ్ర దాడులకు నిరసన తెలుపుతున్న చింతపర్తి గ్రామస్తులు

ఉగ్రవాదంపై పెల్లుబికిన నిరసన

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదుల దాడుల్లో మృతి చెందిన 26 మంది హిందూ పర్యాటకుల ఆత్మకు శాంతి చేకూరాలంటూ శనివారం మదనపల్లెలో పార్టీల కతీతంగా ప్రజలు కాగడాల ర్యాలీ నిర్వహించారు. స్థానిక పీఅండ్‌టీ కాలనీలోని వివేకానందుడి విగ్రహం నుంచి ఎన్టీఆర్ సర్కిల్, బీసెంట్ సర్కిల్, బెంగళూరు బస్టాండు మీదుగా మున్సిపల్ కార్యాలయంలోని భరతమాత విగ్రహం వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా జనసేన రాయలసీమ కో ఆర్డినేటర్ గంగారపు రాందాస్‌చౌదరి మాట్లాడుతూ అమాయకులైన 26 మంది పర్యాటకుల ప్రాణాలను పొట్టన పెట్టుకున్న ఉగ్రవాదులను కనికరం లేకుండా తుద ముట్టించాలన్నారు. కురవంక సర్పంచ్ చిప్పిలి చలపతి, జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి దారం అనిత, బీజేపీ నాయకులు పులి నరేంద్రరెడ్డి, బండి ఆనంద్, ఎమ్మార్పీఎస్ నేత నరేంద్రమాదిగ, తదితరులు పాల్గొన్నారు. స్థానిక హెడ్‌పోస్టాఫీసు ఎదుట సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు నివాళులర్పించారు. మతకల్లోలాలు సృష్టించడానికే ఉగ్రదాడులు నిర్వహించారని అన్ ఎయిడెడ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ నాయకులు వ్యాఖ్యానించారు. స్థానిక అంబేడ్కర్ సర్కిల్ నుంచి విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కరెస్పాండెంట్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు.

పీలేరు రూరల్: ఉగ్రవాదులు ఎక్కడ ఉన్నా ఏరిపారేయాలని టీడీపీ రాజంపేట పార్లమెంట్ నియోజక వర్గ అధికార ప్రతినిధి కోటపల్లె బాబురెడ్డి అన్నారు. ఎమ్మార్పీఎస్ పీలేరు నియోజక వర్గ ఇన్‌చార్జి గండికోట వెంకటేష్ ఆధ్వర్యంలో శనివారం పీలేరులో నిర్వహించిన ర్యాలీలో ఆయన మాట్లాడారు ఉగ్రదాడిలో చనిపోయిన వారి ఆత్మశాంతి కోసం కొంతసేపు మౌనం పాటించారు. మాతమ్మ ఆలయంలో మృతుల ఆత్మశాంతి కోసం పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి రామకృష్ణ మాదిగ, నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు రెడ్డి రమేష్‌బాబు, పీలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ పురం రామమూర్తి, జనసేన జిల్లా కార్యదర్శి కలప రవి తదితరులు పాల్గొన్నారు. ఎంఈవో లోకేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో పీలేరు ఎమ్మార్సీ వద్ద నిరసన వ్యక్తం చేశారు. జిల్లా ఆర్థిక కార్యదర్శి అరవ వేణుగోపాల్‌రెడ్డి, పీలేరు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భాస్కర్‌రెడ్డి, వెంకట్రమణ,రాష్ట్ర కమిటీ సభ్యుడు హహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

కురబలకోట: మైనార్టీల ఆధ్వర్యంలో ఉగ్రదాడిలో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని ర్యాలీ నిర్వహించారు.

వాల్మీకిపురం : మండలంలోని చింతపర్తి గ్రామంలో స్థానికులు, ప్రజా సంఘాలు, యువత ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం నుంచి క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ మహితా శేషాద్రిరెడ్డి, నజీర్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, డ్వాక్రా మహిళలు, యువత, విద్యార్థులు పాల్గొన్నారు.

బి.కొత్తకోట: మండలంలోని గట్టు గ్రామంలో స్థానికులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. జాతీయజెండాను చేతపట్టి, ఉన్మాదుల చేతిలో మృతిచెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని బ్యానర్ ప్రదర్శించారు. మన ప్రభుత్వం ప్రతీకార చర్యలు చేపట్టాలని, టెర్రరిస్టు కార్యకలాపాలను రూపుమాపాలని ఆకాంక్షించారు. గట్టు, బయప్పగారిపల్లె గ్రామాలకు చెందిన మహిళలు ర్యాలీలో పాలు పంచుకున్నారు. కార్యక్రమంలో కవికొండలు, కిరణ్‌కుమార్‌రెడ్డి, నరసింహారెడ్డి, హరినాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పీలేరులో కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజలు

మాజీ సైనికుల కుటుంబాలకు డీఎస్సీలో రిజర్వేషన్ కల్పించాలి

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): డీ ఎస్సీలో మాజీ సైనికుల కుటుంబాలకు రెండు శాతం రిజర్వేషన్ కల్పించాలని మాజీ సైనికుల సంఘం డివిజన్ అధ్యక్షుడు కంచర్ల శ్రీనివాసులు నాయుడు, రిటైర్డ్ హవల్దార్ ఎం.వెంకటరమణా రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం వారు విలేకర్ల తో మాట్లాడుతూ 1971లో ఇచ్చిన జీవో నెంబర్ 929 ప్రకారం సైనికుల భార్యలు, మాజీ సైని కులు, మాజీ సైనికుల భార్యలను డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా ఉపాధ్యాయ పోస్టుల్లో నియమించేవారన్నారు. 2000 సంవత్సరంలో ఈ జీవో రద్దైందన్నారు. 2002లో అప్పటి ప్రభుత్వం మాజీ సైనికులకు ఉపాధ్యాయ రిక్రూట్‌మెంట్‌లో 2 శాతం రిజర్వేషన్ కల్పించినా, దీనిపై స్పష్టత లేదన్నారు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీలో రెండు శాతం పోస్టులు(340) మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యులకు కేటాయించాలన్నారు. ఒకవేళ అర్హులు లేకుంటే ఆ పోస్టులను బ్యాక్‌లాగ్ పోస్టుల కింద పరిగణిం చాలన్నారు. తమ డిమాండ్లపై ప్రభుత్వం అలోచించాలని కోరారు.

మురుగు కాలువల నిర్మాణ పనులు ప్రారంభం

వాల్మీకిపురం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలో మురుగు కాలువల నిర్మాణ ప్రక్రియను పంచాయతీ అధికారులు వేగవంతం చేశారు. నెలరోజుల క్రితం ఆక్రమణదారులు నోటీసులు అందజేసి ఆక్రమణలను తొలగించారు. శనివారం డ్రైనేజీ పనులు ప్రారంభించారు. గ్రామ పంచాయతీ ఈవో రవీంద్రనాథ్ మాట్లాడుతూ పంచాయతీ స్థలాల ఆక్రమణను ఉపేక్షించబోమన్నారు.



డ్రైనేజీ ఏర్పాటు కోసం తవ్విన గుంత

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

పీలేరు రూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి); ఎస్సీ, ఎస్టీ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలని కేవీపల్లె తహసీల్దార్ నరేంద్రకుమార్, ఎంపీడీవో సుధాకర్ తెలిపారు. శనివారం కేవీపల్లె మండల కేంద్రంలోని దళిత వాడలో సివిల్ రైట్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో తాగునీరు, మురుగు కాలువల నిర్మాణం, సీసీ రోడ్లు, వీధి దీపాల ఏర్పాటు, రక్షిత మంచినీటి సౌకర్యం, తదితర వసతుల కల్పనకు ఆయా శాఖల అధికారులు చొరవ చూపాలని సూచించారు. ముల్లంగి చంద్రయ్య, అంజనేయులు మాట్లాడుతూ దళిత గ్రామాల్లో తాగునీరు, మురుగు నీటి సౌకర్యం కల్పించాలని కోరారు. దళితుల ఆధీనంలో ఉన్న స్థలాలకు పట్టాలు ఇవ్వాలని కోరారు. గతంలో ఎప్పుడో ఇచ్చిన ఇందిరమ్మ ఇళ్లు చిన్నపాటి వర్షానికి సైతం ఉరుస్తున్నాయని, కొత్తగా ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. గ్రామాలలో మరమ్మతులకు గురైన చేతి బోర్లు తక్షణం రిపేరు చేయించాలని కోరారు. వ్యవసాయాధికారిణి శ్రావణి మాట్లాడుతూ సబ్సిడీలో పీవీసీ పైపులు, ట్రాక్టర్ రొటోవేటర్లు ఇస్తామని, ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. ఈ సమావేశంలో అధికారులు ఏఈ మధు, వివిద శాఖల అధికారులు, ఎమ్మార్పీఎస్ నేతలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



సివిల్ రైట్స్ డే కార్యక్రమంలో అధికారులు

చిరుతదాడిలో మేక మృతి.. యజమానికి నష్టపరిహారం

నిమ్మనపల్లి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): చిరుతదాడిలో చనిపోయిన మేక యజమాని గంగుల ప్పకు ఎఫ్ఆర్వో జయప్రసాద్‌రావు శనివారం నష్టపరిహారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముష్టూరు పంచాయతీ పారేసు వారిపల్లి గంగులప్పకు చెందిన మేక గత ఏడాది నవంబరులో తవళం బీట్‌లో చిరుతదాడిలో మృతి చెందిన మేక యజమాని గంగులప్పకు ప్రభుత్వం రూ.7500 నష్టపరిహారం మంజూరు చేసిందన్నారు. ఇందుకు సంబంధించిన డీడీని మదనపల్లి అటవీశాఖ కార్యాలయంలో అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ మదనమోహన్, ఎఫ్‌బీవో దీప తదితరులు పాల్గొన్నారు



మేక యజమానికి నష్టపరిహారం అందజేస్తున్న ఎఫ్ఆర్వో జయప్రసాద్‌రావు

కలికిరి మండలంలో మరో రెండు ఉన్నత పాఠశాలలు

కలికిరి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో మరో రెండు ఉన్నత పాఠశాలలకు అనుమతులు వచ్చినట్లు ఎంఈవో కరీముల్లా తెలిపారు. గుట్టపాళెం, మర్రికుంటపల్లెలోని ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా మార్చినట్లు వివరించారు. ఈ విద్యా సంవత్సరం నుంచే పై తరగతులు ప్రారంభమవుతా యన్నారు. పరిసర ప్రాంతాల విద్యార్థులు తమకు అనుకూలమైన ఉన్నత పాఠశాలను ఎంచుకునేందుకు వచ్చిన ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. కాగా విద్యా హక్కు చట్టం మేరకు ప్రతి ప్రైవేటు పాఠశాలలోనూ ఒకటవ తరగతిలో ఉచిత ప్రవేశాలకు 25 శాతం సీట్లు రిజర్వు చేసి ఉంచామని ఎంఈవో వివరించారు. ఆయా ప్రైవేటు పాఠశాలల్లో సీట్ల కోసం ఈ నెల 28వ తేదీ నుంచి మే 15వ తేదీలోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు పంపుకోవచ్చని తెలిపారు. అనాథ పిల్లలు, హెచ్‌ఐవీ బాధిత కుటుంబాలకు చెందిన వారు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈబీసీలకు చెందిన పిల్లలందరూ ప్రవేశాలకు అర్హులేనని చెప్పారు. ఇతర వివరాలకు స్థానిక మండల విద్యా శాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

నిమ్మనపల్లి: ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లను పేద విద్యార్థులకు కేటాయించినట్లు ఎంఈవో-1 పద్మావతి తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం 2009 సెక్షన్(1) ప్రకారం అన్ని ప్రైవేట్ , అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఉచితంగా 25 శాతం సీట్లను కేటాయించినట్లు తెలిపారు. ఈ ఏడాది కేశవరెడ్డి, విజయవాణి పాఠశాలల్లో 1వ తరగతిలో చేరే విద్యార్థులు ఈ నెల 28 నుంచి మే 15 వరకు ఆన్‌లైన్‌లో వరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు ఎమ్మార్సీ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

ఉత్తమ విద్యార్థులకు అభినందన

పీలేరు రూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పరీక్షల్లో పీలేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు చరిత్రాత్మక ఫలితాలు సాధించారని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వీ. నటరాజన్ అన్నారు. శనివారం పీలేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యా ర్థుల అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థి భానుశేఖర్ 581 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచాడన్నారు. అనంతరం 500 పైగా మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్ర మంలో విద్యాకమిటీ చైర్మన్ శ్రీరాములు, ఉపాధ్యాయులు శిరీష, లీలావతి, శశిదేవి, షరీఫున్నీసా, జీనత్, నాగవేణి, యర్రయ్య, జనార్దన్ రెడ్డి, రమణ, శివకుమార్, గౌస్, కిషోర్, బాలాజీ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మదనపల్లె అర్బన్: 500 మార్కులు పైగా మార్కులు సాధించిన 31 మంది విద్యార్థులను స్థానిక జడ్పీ హైస్కూల్‌లో అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుబ్బారెడ్డి ఉపాధ్యాయులు నాగరాజ, ఆర్‌వి రమణ, దేవకమ్మ, రామచంద్ర, తదితరలు పాల్గొన్నారు.



ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఆర్టీసీ ఈయూ కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం



కార్యవర్గం ఎంపిక కోసం సమావేశమైన యూనియన్ నాయకులు, కార్మికులు

పీలేరు రూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి); పీలేరు ఆర్టీసీ డిపో ఎంప్లాయిస్ యూనియన్ నూతన కార్య వర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్ను కున్నట్లు జిల్లా కార్యదర్శి బీసీ శేఖర్ తెలిపారు. శనివారం పీలేరు డిపో ఆవర ణలో ఈయూ సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా డిపో అధ్యక్షుడుగా ఆర్.వీ. రమణ, వైస్ ప్రెసిడెంట్‌గా కే.వీ. రమణ, సెక్రటరీగా ఎస్.కే. బాషా, సహాయ కార్యదర్శులుగా బీ. ఆర్. నాయక్, కే. అనిల్, ఏవీ రమణ, డీటీ రెడ్డి, కోశాధికారిగా బీ. వేణుగోపాల్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే వీ రమణ, శ్రీనివాసులు, జోనల్ సహాయ కార్యదర్శులు జీ.ఎస్. మణి, బీటీ నాథ్ పాల్గొన్నారు.

పారిశుధ్య పనులకు శ్రీకారం

పెద్దమండ్యం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి) కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం పారిశుధ్య పనులకు ఇన్‌చార్జ్ ఎంపీడీవో శ్రీధర్‌రావు, గ్రామ పంచాయతీ కార్యదర్శి సుబ్రమణ్యం శ్రీకారం చుట్టారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద మట్టితో లెవెలింగ్ పనులు, మండలంలోని పలు కేంద్రాలకు మరమ్మతులు చేశారు స్థానిక ప్రభుత్వ పాఠశాల ప్రక్కన, పీహెచ్‌సీ, లక్ష్మీనగర్ రోడ్డు పక్కన వున్న చెత్త కుప్పలను తొలగించారు.

వెబ్ డెవలపింగ్ కోర్సులో ఉచిత శిక్షణ

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మదనపల్లెలో వెబ్ డెవలపింగ్ కోర్సులో ఉచితంగా నాలుగు నెలలు శిక్షణ ఇస్తున్నామని జీఎంఆర్ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ ఓబులేసు ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం నుంచి శిక్షణ ప్రారంభమవుతుందన్నారు. ఈ శిక్షణకు ఇంటర్ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని , పూర్తి వివరాలకు స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సు కో ఆర్డినేటర్ నవీన్ 95532 02509 నెంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.

పంచముఖ ఆంజనేయస్వామికి పూజలు

కలకడ , ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాటవారిపల్లెలో కొలువైన పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం పూజలు నిర్వహించారు. స్వామివారిని వేకువజామునే అలంకరించి అభిషేకం, ఆకు పూజ చేశారు. అధిక సంఖ్యలో ప్రజలు స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

నేడు 'మానవత' సమావేశం

పీలేరు రూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి); మానవత పీలేరు సంస్థ సమీక్షా సమావేశం ఆదివారం ఉదయం 8.30కు స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో జరుగుతుందని ఆ సంస్థ పీలేరు చైర్మన్ వీ. రామచంద్ర తెలిపారు. ఈ కార్యక్రమానికి సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు, ముఖ్య అతిథులు హాజరవుతారని తెలిపారు. కమిటీ సభ్యులు, శ్రేయోభిలాషులు, దాతలు హాజరై సమావేశాన్ని విజయ వంతం చేయాలని కోరారు.

చెన్నకేశవస్వామి ఆలయ కార్యవర్గం ఎన్నిక

ములకలచెరువు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేపూరికోట సమీపంలోని చెన్నకేశవ స్వామి ఆలయ కమిటీని ఎన్నుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఆలయం ఆవరణంలో శనివారం గ్రామస్తులు సమావేశమై ధర్మకర్తగా సిద్ధారెడ్డి, సభ్యులుగా లక్ష్మన్న, శ్రీదేవి, చంద్రప్ప, జయమ్మ, రమ్య, వేమారెడ్డి, జయరాంరెడ్డి, వెంకటరమణను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసులురెడ్డి, గ్రామ పెద్దలు మూగి రవిచంద్ర, ఆదిశేషారెడ్డి, కృష్ణారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, అశోక్, మద్దిరెడ్డి, జయరాంరెడ్డి, వెంకట్‌రెడ్డి, జనార్దన్, కృష్ణప్ప తదితరులు పాల్గొన్నారు.

పక్కా గృహాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీవో హరినారాయణ

ములకలచెరువు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): పక్కా గృహాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో హరినారాయణ ఆదేశించారు. ములకలచెరువు సమీపంలోని పక్కాగృహాల లే అవుట్‌లో అసంపూర్తిగా ఉన్న గృహాలను శనివారం పరిశీలించారు. నిర్మాణాలు పూర్తి చేయని 15 మందికి నోటీసులు జారీ చేశారు.

పాలేటమ్మకు పూజలు

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): చిప్పిలి గ్రామంలోని పాలేటమ్మ ఆలయంలో శనివారం తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాం చినబాబు, బీజేపీ నాయకుడు బండి ఆనంద్ పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు వారిని సన్మానించారు. పులి శ్రీని వాసులు, పసుపులేటి వరప్రసాద్, బీదం శివ కుమార్, జయసింహా, రజినీకుమార్, శ్రీకాంత్, పాల్గొన్నారు.

ఉగ్రవాదులపై చర్యలు తీసుకోవాలి

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదులపై కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్‌కే బాషా డిమాండ్ చేశారు. శనివారం తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఉగ్రవాదుల కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మలకు శాంతి కలగాలని ప్రార్థించారు.

స్థలం ఒకరిది.. పరిహారం మరొకరికా!?

● సీటీఎం గ్రామస్థుల నిరసన

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఆర్‌వోబీ కోసం తమ స్థలాలను తీసుకుంటున్న అధికారులు పరిహారం మాత్రం వేరొకరికి ఇస్తున్నారంటూ శనివారం సీటీఎం గ్రామస్తులు గంగమ్మ గుడి ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మదనపల్లె-తిరుపతి రహదారిలో సీటీఎం వద్ద నిర్మిస్తున్న రైల్ ఓవర్ బ్రిడ్జి(ఆర్‌వోబీ)కి తమ ఇళ్లముందు ఉన్న స్థలాన్ని తీసుకుంటున్నారన్నారు. దీనికి సంబంధించిన నష్ట పరిహారాన్ని తమకు ఇవ్వకుండా, 21 ఏళ్ల క్రితం ఇళ్ల స్థలాలు విక్రయించిన లలితకుమారికి ఇచ్చేందుకు రెవెన్యూ అధికారులు సన్నాహాలు చేస్తున్నారన్నారు. డబ్బిచ్చి తాము కొనుగోలు చేసిన ఇళ్ల స్థలాలను, తమ అనుభవంలోని ఇళ్ల స్థలాలను ఆర్‌వోబీకి ఇవ్వడానికి తాము సహకరిస్తున్నామని, అలాగే నష్ట పరిహారం కూడా తమకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ అధికారులు తమకు అన్యాయం చేస్తే ఆర్‌వోబీకి ఇళ్ల స్థలాలు ఇవ్వమని తెగేసి చెప్పారు. ఈ కార్యక్రమంలో బాధితులు వై.రెడ్డిశేఖర్, వై.రెడ్డెప్ప, వి.శ్రీనివాసులు, జె.పాపులమ్మ, సి.చంద్రశేఖర్, ఎస్.రాజశేఖర్, వేణునాయుడు పాల్గొన్నారు.



రహదారి పక్కన నిరసన తెలుపుతున్న ఆర్‌వోబీ నిర్వాసితులు

ఫారంపాండ్ల వద్ద మొక్కలు నాటి సంరక్షించాలి : డ్వామా పీడీ

కలకడ, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): పనులు పూర్తయిన ఫారం పాండ్స్ చుట్టూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని డ్వామా పీడీ వెంకటరత్నం రైతులకు సూచించారు. కలకడ మండలం గంగాపురం పంచాయతీలో ఉపాధిహామీ పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పూడికకు అస్కారం లేకుండా అధిక నీరు నిలిచే లోతట్టు ప్రాంతాలను గుర్తించి ఫారంపాండ్‌లను మంజూరు చేయాలని సిబ్బందికి సూచించారు. పనుల ప్రగతిపై ఆరా తీసి, కూలీల సంఖ్యను పెంచి మండలానికి కేటాయించిన లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. పండ్లతోటల పెంపకం పథకాన్ని పేద రైతులు సద్వినియోగం చేసుకోనేలా అవగాహన కల్పించాలని అన్నారు. పీడీ వెంట ఎంపీడీఓ అబ్దుల్‌రహీం, ఏపీఓ సుజాత, ఉపాధి సిబ్బంది నాగవేణి, రామునాయక్, బాలాజీ ఉన్నారు.



ఉపాధి పనులు పరిశీలిస్తున్న డ్వామా పీడీ వెంకటరత్నం

మద్యపానం ఆరోగ్యానికి హానికరం

● సీఏఆర్‌ఈ కన్వీనర్ మధుసూదన్

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మద్యపానంతో ఆరోగ్యానికి తీవ్ర హాని కలుగుతుందని ఎక్సైజ్ సూపరింటెండెంట్, సీఏఆర్‌ఈ కమిటీ కన్వీనర్ మధుసూదన్ తెలిపారు. శనివారం మదనపల్లె పట్టణం ఇండస్ట్రియల్ ఎస్టేట్ వద్ద సీఏఆర్‌ఈ కమిటీ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ కమిటీ కన్వీనర్ మధుసూదన్ మాటాడుతూ పగలంతా కష్టపడే కార్మికుల్లో కొందరు సాయంత్రమైతే మద్యం తాగి విశ్రాంతి తీసుకుంటున్నారన్నారు. ఈ అలవాటుతో శరీరంలోని సున్నితమైన అవయవాలు పటుత్వం కోల్పోతాయన్నారు. ముఖ్యంగా లివర్ మీద మద్యం దుష్ప్రభావం చూపుతుందని, కంటి చూపు మందగించడంతో పాటు దీర్ఘకాల వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. కార్మికుల ఆరోగ్యం దెబ్బతిని వృత్తిపరంగా ఇబ్బందులు, కుటుంబ పరంగా సమస్యలు వస్తాయన్నారు. సాధ్యమైనంత వరకు కార్మికులు మద్య పానానికి దూరంగా వుండాలన్నారు. ఈ కార్యక్రమంలో మదనపల్లె ఎక్సైజ్ సీఐ భీమలింగ, సాంఘిక సంక్షేమశాఖ డీడీ ఎన్.జయప్రకాష్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రమేశ్‌బాబు, డాక్టర్ కిరణ్, ఎన్‌జీవో సంస్థ నిర్వాహకులు వైవీఎస్ ప్రకాష్, సహదేవరెడ్డి, కార్మికులు పాల్గొన్నారు.



మద్యపానంతో నష్టాలను వివరిస్తున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్

రాష్ట్ర స్థాయి షూటింగ్‌బాల్ పోటీలు ప్రారంభం

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక వశిష్ట స్కూల్‌లో శనివారం అన్నమయ్య జిల్లా షూటింగ్‌బాల్ అసోసియేషన్‌ఆధ్వర్యంలో 8వ రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ చాంపియన్ షిప్ పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ కార్యదర్శి గౌతమి మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడల్లో విద్యా ర్థులు రాణించాలన్నారు. ఇందులో వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పోటీలు ప్రారంభిస్తున్న ఉపాధ్యాయులు

ఘనంగా సహస్ర లింగార్చన

పెద్దతిప్పసముద్రం ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని విరూపాక్షేశ్వరస్వామి ఆలయంలో శనివారం మాస శివరాత్రి సందర్భంగా సనగరం పట్టాభిరామయ్య అధ్వర్యంలో సహస్ర లింగార్చన చేశారు. ముందుగా రుద్రహోమం, ఏకవార రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం పంచహారతి, సప్తహారతి, నక్షత్ర హారతి, మహామంగళ హారతి సమర్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం చేశారు.

నరసింహస్వామికి పూజలు

గుర్రంకొండ, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి):మండలంలోని తరిగొండలో కొలువైన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామి వారికి అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పూజలను చేశారు. స్వామి వారికి అభిషేకాలను చేయించడానికి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. .

చేనేత కార్మికుడి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం చేసిన చేనేత కార్మికుడు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రితో చికిత్స పొందుతున్నాడు. ఆస్పత్రి అవుట్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు మదనపల్లె పట్టణం, నీరుగుట్టువారిపల్లె, రామిరెడ్డి లేవుట్‌కు చెందిన ఎ మల్లికార్జున (30) చేనేత కార్మికుడు. మానసికంగా కుంగిపోయిన అతను శనివారం నిద్రమాత్రలు మింగాడు. గమనించిన కుటుంబసభ్యులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇక్కడ చికిత్స పొందుతున్నాడు.

ప్రజా కళాకారుడు లక్ష్మీనారాయణ మృతి



మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ప్రజా చైతన్య కళాకారుడు కిన్నెర కళామండలి వ్యవస్థాపకుడు లక్ష్మీనారాయణ శనివారం మృతి చెందాడు. గత 30 ఏళ్లుగా ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో నిర్వహించే అన్ని రంగాల్లో తనదైన శైలిలో సాం స్కృతిక ప్రదర్శనలు చేశారు. ప్రజలకు చైతన్యం చేయడానికి తిరుమతి, అన్నమయ్య, చిత్తూరు, కడప జిల్లాలోనే కాకుండా రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రదర్శనలిచ్చారు. ప్రజాకవి పోతబోలు రెడ్డెప్ప రచించిన అక్షరబాగోతం, ఎయిడ్స్‌పాశం, నేల తల్లిని కాపాడుకుందాం, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, వాటర్‌షెడ్ల కార్యక్రమాలు, ఒగ్గుకథ, పల్లె సుద్దులు, జానపద గేయాలు ఆలపించారు. మిత్రులు, బంధువులు, అభిమానులు, కళాకారులు ఆయన మృతికి సంతాపం తెలిపారు.

ఎంపీడీవో బదిలీ

బి.కొత్తకోట, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఎంపీడీవోగా పనిచేస్తున్న దిలీప్‌కుమార్ బదిలీ అయ్యారు. తంబళ్లపల్లె మండలంలో ఈవోపీఆర్డీగా పనిచేస్తున్న ఈయన ఎంపీడీవో ఎఫ్ఏసీ గా నియమితులయ్యారు. తాజాగా ఎంపీడీవోగా ఆయనకు పదోన్నతితో పాటు తిరుపతి జిల్లాకు పోస్టింగ్ ఇచ్చారు. ఈ మేరకు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వెలువడ్డాయి.

44 మంది చిన్నారులకు ఖత్నా

కురబలకోట, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాజ్ స్కూల్‌లో కరెస్పాండెంట్ ఇస్మాయిల్ ఆధ్వర్యంలో శనివారం 44 మంది చిన్నారులకు ఉచితంగా ఖత్నా నిర్వహించారు. చిన్నారుల కుటుంబాలకు వంట సామగ్రి అందజేశారు.

సెలవు రోజునా విద్యుత్ బిల్లుల స్వీకరణ

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మదనపల్లె డివిజన్‌లో విద్యుత్ బిల్లులు చెల్లించడానికి ఆదివారం సెలవు రోజైనా ఎస్పీడీసీఎల్ ఈఆర్‌వో కార్యాలయాలు తెరుస్తున్నామని ఎస్పీడీసీఎల్ ఈఈ గంగాధరం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ సౌకర్యాన్ని ఉపయోగించుకుని విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చని ఈఈ తెలిపారు.

నేటి నుంచి సంతాన వేణుగోపాల స్వామి తిరునాళ్లు

కురబలకోట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తెట్టు గ్రామంలో ఆదివారం నుంచి సంతాన వేణుగోపాల స్వామి తిరునాళ్లు ప్రారంభం కానున్నాయి. రాత్రి స్వామివారికి కల్యాణోత్సవం, గరుడోత్సవం నిర్వహిస్తారు. చాందినీ బండ్లను ఊరేగిస్తారు. సోమవారం పగలు రథోత్సవం ఉంటుంది.